ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 వరంగల్
బుధవారం 9 ఏప్రిల్ 2025



ఖానాపురంలో నేలవాలిన మొక్కజొన్న పంట

- పంటలు, ఇళ్లకు తీవ్ర నష్టం
- నేలరాలిన మామిడి కాయలు
- వాలిన మొక్కజొన్న, వరి
- విరిగిపడ్డ చెట్లు, ఎగిరిపోయిన రేకులు
- భయాందోళన చెందిన ప్రజలు
- ఆదుకోవాలని రైతుల వేడుకోలు

చెడగొట్టు గాలి

నర్సంపేట డివిజన్‌లో గాలి దుమారం



గోల్యానాయక్ తండాలో రేకులు లేచిపోయిన ఇల్లు



ఖానాపురంలో తెల్లకంకిగా మారిన వరి గొలుసులు

ఖానాపురం/చెన్నారావుపేట/దుగ్గొండి/నెక్కొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్‌లో సోమవారం రాత్రి వీచిన ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. బలంగా వీచిన గాలులకు మామిడితోటల్లో కాయలు రాలిపోయాయి. మొక్కజొన్న పంట మొత్తంగా వాలిపోయింది. పొట్టదశలో వరిపైరుకు తీవ్ర నష్టం వాటిల్లింది. పలు ఇండ్లపై రేకులు ఎగిరి పోయాయి. రహదారులపై చెట్లు నేలకొరిగాయి. తీవ్రమైన శబ్దంతో వీచిన గాలులకు ప్రజలు భయాందోళనకు గురయ్యాయి. ముఖ్యంగా నర్సం పేట డివిజన్‌లోని ఖానాపురం, నెక్కొండ, చెన్నారావుపేట, దుగ్గొండి మండలాల్లో తీవ్రంగా నష్టం వాటిల్లింది.

దెబ్బతిన్న పంటలు

ఖానాపురం మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి వీచిన గాలిదుమారంతో ప్రజలు ఇబ్బందు లు పడ్డారు. పలువురి రైతుల పంటలు దెబ్బతి న్నాయి. అశోక్‌నగర్ శివారు గోల్యానాయక్ తండాలో ధరావత్ నర్సింహకు చెందిన ఇంటి రేకులు ఎగిరిపోయి దూరంగా పడ్డాయి. కొత్తూరులో మదర్‌థెరిస్సా మహిళా సంఘానికి చెందిన నాలుగున్నర ఎకరాల మామిడి తోటలోని కాయలు నేలరాలాయి. అదే విధంగా పలు చోట్ల ఏపుగా పెరిగిన వరిపైర్లు, మొక్కజొన్న పంటలు నేలవాలడంతో రైతులు ఇబ్బందులుపడ్డారు. అలాగే గాలిదుమారం బీభత్సంతో వరి పైరుపై తీవ్ర ప్రభావం పడింది. పొట్టదశలో ఉన్న వరిపైరు పాలుపోసుకుంటున్న వరి గింజల్లో మూగ పగిలి తెల్లకంకులుగా మారండంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. సోమవారం వరకు నిక్షేపంలా ఉన్న వరిపొలాలు గాలిదుమారంతో రాత్రికి రాత్రే తెల్లకంకిగా మారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెద్దమ్మ గడ్డ, మను బోతులగడ్డ, బండమీది మామిడి తండా శివారులోని పంట పొలాల్లో తెల్ల కంకి తీవ్రంగా ఉందని రైతులు తెలిపారు. వాతావరణ మార్పులతో కలిగిన నష్టానికి ప్రభుత్వం స్పందించి వెంటనే పరిహారం అందించాలని రైతులు ఆబోతు అశోక్, యాకుబ్‌పాషా, వల్లెపు సోమయ్య, దేవేందర్‌తో పాటు పలువురు రైతులు కోరుతున్నారు.

మొక్కజొన్న వరికి నష్టం

దుగ్గొండి మండలంలోని పలు గ్రామాలలో సోమవారం రాత్రి వీచిన ఈదురు గాలులతో వరి, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. మండలంలో ప్రధానరహదారిపై చెట్లు విరిగి పడడంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. పెద్దఎత్తున ఈదురు గాలిరావడంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందారు. మొక్కజొన్న, వరి పంట సాగు చేసిన రైతులు నష్టపోయారు.

నేలరాలిన మామిడి కాయలు

చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేట, జల్లి, ఖాదర్‌పేట, ఉప్పరపల్లి, కోనాపురం తోపాటు పలు గ్రామాలల్లో సోమవారం రాత్రి వీసిన ఈదురుగాలులకు పలు మామిడితోటల్లో ని కాయలు నేలరాలాయి. అంతేకాకుండా పలు చోట్ల ఇండ్లపై రేకులు గాలికి దెబ్బతిన్నాయి. ఈ దురుగాలులతో నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

కూలిన షెడ్లు, కూలిన చెట్లు

నెక్కొండ మండలంలో సోమవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. గొట్లకొండ గ్రామ శివారు మామిడితోట తండాలో రైతు మాలోతు దలిసింగ్, వెంకన్నలకు చెందిన నిర్మాణంలో ఉన్న గేదెల షెడ్డు నేలకూలింది. దీంతో రూ.10లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితులు తెలిపారు. నష్టపరిహారం ఇప్పించాలంటూ తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు మంగళవారం వారు వినతిపత్రం అందించారు. నెక్కొండ - నర్సంపేట ప్రధాన రహదారిలో భారీ వృక్షాలు రోడ్డుకు అడ్డంగా పడటంతో వాహనాల రాకపోకల కు అంతరాయం ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై మహేందర్.. సిబ్బందితో కలిసి రాత్రి సమయంలో జేసీబీ సహాయంతో చెట్లను తొలగించారు. గాలి కారణంగా దీక్షకుంట, సీతారాంపురం, ము దిగొండ, అమీన్‌పేట గ్రామాల్లో చెట్లు నేలకూలాయి. రాత్రి సమయంలో అకస్మాత్తుగా వచ్చిన గాలివానతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. రెండు గంటలు పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.



చెన్నారావుపేటలో నేలరాలిన మామిడికాయలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి

పట్టాలు పొందిన వేళ.. ఆనంద హేల

అట్టహాసంగా కేఎంసీ 61వ గ్రాడ్యుయేషన్ డే

- ఆనందంతో పులకరించిన తల్లిదండ్రుల మనసులు
- ముఖ్యఅతిథిగా హాజరైన కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ నందకుమార్‌రెడ్డి
- వైద్యులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచన



కూతురు పట్టా అందుకున్న ఆనందంలో తల్లి

7

ఓఆర్ఆర్ బ్రిడ్జి వద్ద బస్సు బోల్తా

- డ్రైవర్‌తో సహా పలువురు ప్రయాణికులకు గాయాలు
- హనుమకొండ జిల్లా చింతగట్టు వద్ద ఘటన



6

పరిశ్రమల స్థాపనతోనే ఆర్థిక ప్రగతి

వరంగల్ కలెక్టర్ సత్యశారద



పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనతోనే ఆర్థిక ప్రగతి సాధ్యమని కలెక్టర్ సత్యశారద అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. టీజీ ఐపాస్ ఆన్‌లైన్ ద్వారా వివిధ శాఖల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి గడువులోగా అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో టీజీ ఐపాస్ ద్వారా వివిధ శాఖలకు సంబంధించి ఇప్పటి వరకు 1,365 యూనిట్లకు దరఖాస్తులు రాగా, అందులో 1,076 యూనిట్లకు అనుమతులు ఇచ్చామని, 180 అసంపూర్తిగా ఉన్నందున తిరస్కరించామన్నారు. సమావేశం అనంతరం పోషణ పక్షం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లాలో పోషణ పక్షం కార్యక్రమాల్లో నిర్దేశించిన అంశాలను దృష్టిలో ఉంచుకొని అవగాహన కార్యక్రమాలను నిర్వ హించాలని అధికారులకు సూచించారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా పోషణ పక్షం ఈ నెల 8 నుంచి 22 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జీఎం ఇండస్ట్రీస్ రమేశ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి శోభన్ బాబు, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దేవునూరు గుట్టల స్థలాన్ని ఆక్రమించలేదు..

- నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా..
- నాపై ఆరోపణలు చేసినవారు క్షమాపణలు చెప్పాలి..
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ధర్మసాగర్ మండలంలోని దేవునూరు గుట్టల స్థలాన్ని ఆక్రమించి 2వేల ఎకరాలు కబ్జా చేసినట్లు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మండిపడ్డారు. తాను గుంట భూమి కబ్జా చేసినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వారి ఇంటిలో గులాంగిరి చేస్తానని, నిరూపించకపోతే వారు నా ఇంటిలో గులాంగిరి చేయాలని సవాల్ చేశారు. మంగళవారం హనుమకొండ కాంగ్రెస్ కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. దేవునూరు గుట్టల చుట్టూ ఆరు గ్రామాల పరిధిలో ఫారెస్టు భూమి, అసైన్డ్, పట్టా భూములు ఉన్నాయని తెలిపారు. గతంలో హనుమకొండ కలెక్టర్‌గా పనిచేసిన రాజీవ్ హనుమంతు ఆధ్వర్యంలో రెవెన్యూ, ఫారెస్టు శాఖలు సంయుక్తంగా సర్వే చేసినట్లు తెలిపారు. మొత్తం 3,950ఎకరాల భూమిలో చేసిన సర్వేలో 3,750 ఎకరాలు మాత్రమే భూమి అటవీశాఖ ఆధీనంలో ఉందని, మిగతా 200 ఎకరాలల్లో అసైన్డ్, పట్టా భూములు ఉన్నట్లు తేలిందన్నారు. ఈ మేరకు అప్పటి అధికారులు హద్దులు కూడా నిర్ధారించినట్లు తెలిపారు. అయితే 1967 నుంచి అటవీశాఖ ఆధీనంలో ఉన్న 43.3ఎకరాల భూములలో తమ పట్టా, అసైన్డ్ భూములు ఉన్నాయని సుమారు 23 మంది 50 ఏళ్లుగా పంటలు వేసుకుంటే అటవీశాఖ అధికారులు తొలగిస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంత ఎమ్మెల్యేగా రైతులకు చెందిన భూమిని రైతులకు అందించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పట్టా పాస్‌బుక్కులు ఉన్న రైతులకు 2017 నుంచి రైతుబంధు డబ్బులు వస్తున్నాయని అన్నారు. వారి భూమిని వారికి ఇప్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మిగతా ఫారెస్టు భూముల్లో ఇటీవల ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో జరిగిన సమీక్ష సమావేశంలో ఏకో టూరిజం డెవలప్‌మెంట్ చేసేందుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. కాగా, 14 ఏళ్ల మంత్రిగా, ఎమ్మెల్యేగా మొత్తం 30 ఏళ్ల తన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకమని ఎమ్మెల్యే కడియం పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అందరికంటే తాను పెద్ద లీడర్‌ను తానేనని తెలిపారు. అందుకే తనను టార్గెట్ చేస్తున్నారని వాపోయారు. తనపై అసత్యపు ఆరోపణలు చేసినందుకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యలు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, లేకుంటే తాను తీసుకోబోయే చట్టపరమైన చర్యలకు సిద్ధంగా ఉండాలని కడియం హెచ్చరించారు.

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులు పార్కు స్థలాన్ని కబ్జా చేసి పర్యావరణం గురించి మాట్లాడడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజల కోసం పనిచేస్తున్న తమపై అసత్యపు ఆరోపణలు మానుకోవాలని హితవుపలికారు. గత ప్రభుత్వంలో బీఆర్‌ఎస్ నాయకులు చేసిన కబ్జాలన్నీ బయటకు తీస్తామని ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ నాయకులను హెచ్చరించారు. 30 ఏళ్లగా విలువలతో కూడిన రాజకీయాలు చేస్తున్న కడియం శ్రీహరిలాంటి వారిపై బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపణలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, ఆర్‌టీఏ మెంబర్ పల్లకొండ సతీష్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఆగని ఐపీఎల్ బెట్టింగ్ దందా

- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పందాలు కాస్తున్న వైనం
- నిఘా పెట్టి కట్టడి చేస్తున్న పోలీసులు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ సీజన్ వేళ క్రికెట్ బెట్టింగ్ జోరుగా సాగుతోంది. బెట్టింగ్ రాయుళ్లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో యథేచ్ఛగా పందాలు కాస్తున్నారు. పోలీసులు నిఘా పెట్టినప్పటికీ వారి కళ్లుగప్పి బెట్టింగ్ దందా చేస్తున్నారు. గత నెల 22 నుంచి ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం కాగా, ఈ 15 రోజుల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ లోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో క్రికెట్ బెట్టింగ్ పాల్పడుతూ పలువురు పోలీసులకు పట్టుబడ్డారు. వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఐపీఎల్ బెట్టింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. నిఘావర్గాలతో పాటు వేగుల ద్వారా సమాచారం రాబడుతున్నారు. అయితే లాఅండ్‌ఆర్డర్ పోలీసులు మాత్రం బెట్టింగ్‌లపై ఉదాసీతనగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

ఘటనలు

- మార్చి 25న పద్మాక్షికాలనీలో రాధా ఎక్ఛేంజ్ యాప్ ద్వారా బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి రూ.1,58,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో ముగ్గురిలో కాకినాడకు చెందిన వీరమణికుమార్‌ను ఆదివారం హనుమకొండ పోలీసులు అరెస్టు చేసి 1,50,000 నగదును స్వాధీనం చేసుకున్నారు.
- ఏప్రిల్ 3న గీసుగొండలో ఆఫ్‌లైన్‌లో బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని రూ.10,000 స్వాధీనం చేసుకున్నారు.
- ఏప్రిల్ 5న కాజీపేట పీఎస్ పరిధిలో కరీంనగర్ జిల్లా వీణవంక మండలానికి చెందిన నలుగురిని అరెస్టు చేసి రూ.20,000 నగదును సీజ్ చేశారు.
- ఏప్రిల్ 5న ఆత్మకూరు పీఎస్ పరిధిలోని పెద్దపూర్ గ్రామానికి చెందిన ముక్కల రాజు ధపబెట్, గోల్డెన్ 365 (తీన్ పత్తా) వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదుపులోకి రూ42,000 నగదును సీజ్ చేశారు. ఈ ఘటనలో నల్గొండకు చెందిన మర్రి సుధీర్, సురేశ్ అనే వ్యక్తులు పరారీలో ఉన్నారు.



బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు : సీపీ

వరంగల్ క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌లతో పాటు ఇతరత్రా బెట్టింగ్‌లకు పాల్పడే వ్యక్తులతో పాటు ప్రోత్సహించేవారిపై కఠిన చర్యలుంటాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల కాలంలో యువత అధికంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో క్రికెట్ బెట్టింగ్ యాప్‌ల మోజులో పడి బంగారు భవిష్యత్ అంధకారం చేసుకుంటున్నారన్నారు. యువత ఆన్‌లైన్ యాప్‌లలో పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా నష్టపోయి బలవన్మరణాలకు పాల్పడుతున్నారన్నారు. బెట్టింగ్ భూతాన్ని కట్టడి చేయాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ఐపీఎల్ సీజన్ ప్రారంభమైనందున పిల్లలపై తల్లితండ్రులు నిఘా ఉంచాలన్నారు. కమిషనరేట్ పరిధిలో బెట్టింగ్‌లను కట్టడి చేసేందుకు అందుబాటులో ఉన్న సాంకేతికతను ఉపయోగించి చర్యలు చేపడుతున్నామన్నారు. ఐపీఎల్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 4 కేసుల్లో 9 మందిని అరెస్టు చేసి రూ.42 లక్షల 68వేల లావాదేవీలు జరిగినట్లుగా గుర్తించామన్నారు. బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సీపీ కోరారు.

గీసుగొండ మండలంలో జోరుగా..

గీసుగొండ(ఆంధ్రజ్యోతి): గీసుగొండ మండలంలో క్రికెట్ బెట్టింగ్ కలకలం సృష్టిస్తోంది. బెట్టింగ్ నిర్వహిస్తున్న మండలకేంద్రానికి చెందిన గిరిధర్ అనే యువకుడిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా, మరో ఇద్దరు వ్యక్తులు తప్పించుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. కాగా, ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో క్రికెట్ బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. బెట్టింగ్‌కు పాల్పడుతున్నవారికి డబ్బులు ఎక్కడ నుంచి వస్తున్నాయనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇటీవల దొరికిన వ్యక్తుల ఫోన్‌లలోని ఫోన్‌పే, గూగుల్‌పేల ద్వారా డబ్బులు ఎక్కడ నుంచి వచ్చాయి? అని ఆరా తీస్తున్నారు. అలా సేకరించిన సమాచారంతో అనుమానిత వ్యక్తులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. అందులో బడా వ్యక్తులు కూడా ఉండటం కలకలం రేపుతోంది. అయితే కొన్నేళ్ల కిందట గీసుగొండకు చెందిన ఓ ఇంజనీరింగ్ విద్యార్థి క్రికెట్ బెట్టింగ్ మోజులో పడి డబ్బులు పోగొట్టుకుని ఆత్మహత్య చేసుకోవడం అప్పట్లో కలకలం రేపింది.



కర్రెగుట్టలపైకి రాకండి

- కగార్ నుంచి రక్షణ కోసం బాంబులు అమర్చాం..
- తొలిసారి ప్రకటించిన మావోయిస్టులు
- వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరుతో లేఖ విడుదల

6

ఎండల వేళ.. పశువులు జాగ్రత్త

- అధిక ఉష్ణోగ్రతలతో మూగజీవాలకు ప్రమాదమే..
- పశుపోషణలో యజమానులు మెళకువలు పాటించాల్సిందే..

7



బస్సును తొలగిస్తున్న పోలీసులు

ఓఆర్ఆర్ బ్రిడ్జి వద్ద బస్సు బోల్తా

- డ్రైవర్‌తో సహా పలువురు ప్రయాణికులకు గాయాలు
- హనుమకొండ జిల్లా చింతగట్టు వద్ద ఘటన

హసన్‌పర్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని చింతగట్టు క్యాంపు ఓఆర్ఆర్ బ్రిడ్జి కింద మంగళవారం తెల్లవారుజామున సుమారు 3 గంటలకు ఓ ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. దీంతో డ్రైవర్ సహా పలువురికి తీవ్రగాయాలయ్యాయి. కేయూ ఎస్ఐ శ్రీకాంత్, ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఆదిలాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ లహరి ఏసీ బస్సు మంగళవారం తెల్లవారు జామున హనుమకొండ బస్టాండ్ నుంచి ప్రయాణికులను ఎక్కించుకొని కరీం నగర్ మీదుగా ఆదిలాబాద్ వెళ్తోంది. ఈ క్రమంలో కరీంనగర్ - హనుమకొండ జాతీయ రహదారిపై చింతగట్టు క్యాంపు ఓఆర్ఆర్ బ్రిడ్జి వద్ద లారీ యూటర్న్ తీసుకుని ఓఆర్ఆర్‌పైకి ఎక్కే క్రమంలో లహరి బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయగా బస్సు బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న బత్తుల వెంకటేష్, గంపల శ్రీకాంత్, ఎం.డి.జాకీర్‌హుస్సేన్, వొజ్జ కోటేశ్వర్‌రావు, ఎస్‌కే. మోజీ, కల్లెం రత్నారాజుతో పాటు ఆర్టీసీ బస్సు డ్రైవర్ మారంపల్లి సుభాష్‌చంద్ర కూడా గాయపడ్డాడు. గాయపడిన వీరిని 108 ద్వారా ఎంజీఎంకు తరలించి చికిత్స అందించారు. లారీ డ్రైవర్ వినోద్ సింగ్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సుంకరి రవి కుమార్ తెలిపారు. కాగా, కరీంనగర్ - హనుమకొండ ప్రధాన రహదారిపై బస్సు బోల్తాపడడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుమారు నాలుగు గంటల పాటు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో కేయూ ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో బస్సును తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గార్డియన్ హాస్పిటల్ వార్షికోత్సవం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని గార్డియన్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ 15వ వార్షికోత్సవాన్ని మంగళవారం హాస్పిటల్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ అధినేత, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కాశీప్రసాద్‌రావు, హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ స్వర్ణలత కేక్ కట్‌చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం డాక్టర్ కాశీప్రసాద్‌రావు మాట్లాడుతూ.. 15 ఏళ్ల నుంచి దిగువ మధ్య తరగతి ప్రజలకు మల్టీస్పెషాలిటీ సేవలు అందిస్తూ మన్ననలు పొందుతున్నట్లు తెలిపారు. తెలంగాణలోనే ఎక్కువ ఆర్థోపెడిక్ సర్జరీలు చేసిన ఘనత గార్డియన్ హాస్పిటల్‌కు దక్కిందన్నారు. ఇక ముందు కూడా కార్పొరేట్ వైద్య సేవలు ఇలాగే అందిస్తామని, ప్రజల సహాయ సహకారాలు కూడా అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ కాశీప్రసాద్‌రావు

సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి
- హనుమకొండ సర్కిల్ విద్యుత్ అధికారులతో సమీక్ష

రాంనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎన్పీడీసీఎల్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, కరీంనగర్ ప్రాంతాల్లో ఇండోర్ సబ్‌స్టేషన్‌ల ఏర్పాటు కోసం కార్యాచరణ రూపొందించాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అధికారులకు సూచించారు. హనుమకొండ కార్పొరేట్ కార్యాలయంలో మంగళవారం హనుమకొండ సర్కిల్ విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ప్రతీ పనిలో సాంకేతికతను అవలబించాలని సూచించారు. డ్రోన్ ద్వారా పోల్ టూ పోల్ సర్వే చేయించాలని సూచించారు. భవిష్యత్‌లో లైన్ వేసే పరిస్థితి ఎక్కడ ఉండదో అక్కడ అండర్ గ్రౌండ్‌లో కేబుల్ వేస్తామన్నారు. దేవునూరు, క్యాంతనపల్లి ప్రాంతాల్లో వేసే లైన్ల పనులను వేగవంతం చేయాలన్నారు. అత్యవసర సేవలందించే ప్రభుత్వ కార్యాలయాలకు 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్యూర్ కాకుండా విధిగా టాంగ్ టెస్టర్ రీడింగ్ తీసుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరు పెంచాలని, 60 శాతం కంటే లోడ్‌పెరిగే ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచాలన్నారు. వినియోగదారులు ఎట్టిపరిస్థితుల్లో విద్యుత్ సిబ్బంది చేసే పనులను చేయకూడదని, 1912కు ఫోన్ చేసి సేవలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు అశోక్‌కుమార్, సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, సీఈలు రాజు చౌహాన్, తిరుమల్‌రావు, హనుమకొండ ఎస్ఈ మధుసూదన్‌రావు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాలో సిబ్బంది పాత్ర కీలకం

నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడంలో విద్యుత్ సిబ్బంది పాత్ర కీలకమని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్, మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం), ఆర్టిజన్స్ సిబ్బందితో మంగళవారం సీఎండీ ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. వినియోగారులతో సత్సంబంధాలు ఉండే ది కింది స్థాయి సిబ్బందికేనని, అలాంటి సమయంలో వారికి మెరుగైన సేవలందించే అవకాశం వారికే ఉంటుందని గుర్తు చేశారు. విద్యుత్‌శాఖలో కొత్త మార్పులు తీసుకొస్తున్నామని, ప్రతీ ఒక్క సిబ్బంది విద్యుత్ భద్రత ప్రమాణాలు పాటించాలన్నారు. రబీ సీజన్‌లో మెరుగైన విద్యుత్ సరఫరా అందించారని, ఖరీఫ్‌లో కూడా బాగా పనిచేయాలని సూచిం చారు. విద్యుత్ భద్రతకు పెద్దపీట వేస్తున్నామని, డీఈ టెక్నికల్ అధికారులను నోడల్ సెఫ్టీ ఆఫీసర్లుగా నియమించామన్నారు. టోల్‌ఫ్రీ సేవలు విస్తృతం చేశామని, ప్రతీ ఒక్క వినియోగదారుడు 1912 గుర్తుంచుకునేలా ప్రచారం చేయాలన్నారు. రూరల్ ప్రాంతాల్లో బ్రేక్ డౌన్ టీమ్‌లను ఏర్పా టు చేశామని, ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే నియామకాలు చేపడుతామన్నారు. ఆన్‌మ్యాన్డ్ వేతనాలు పెంచామని, భద్రతలో భరోసా నిచ్చేలా కోటి రూపాయల బీమా సౌకర్యం కల్పించామన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్ అశోక్‌కుమార్, సదర్‌లాల్, ఎస్ఈ మధుసూదన్, డీఈ సాంబరెడ్డి, విజేందర్‌రెడ్డి, ఏడీఈలు, హనుమకొండ సర్కిల్ ఓ అండ్ ఎం, ఆర్టిజన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

రాజాజీనగర్ బ్రిడ్జి నిర్మాణాలు నిలిపివేయండి

- కాంట్రాక్టర్‌ను ఆదేశించిన బల్దియా అధికారులు
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన యంత్రాంగం

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 52, 53 డివిజన్‌ల మధ్యలో నిర్మించిన రాజాజీనగర్ బ్రిడ్జి సమీపంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపి వేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను బల్దియా అధికారులు ఆదేశించారు. నాలా నుంచి సక్రమంగా ప్రవహించాల్సిన మురుగు నీటిని అడ్డుకునే విధంగా నాలా మధ్యలో 15 పిల్లర్లు నిర్మించడం ఏమిటని ప్రశ్నిస్తూ పనులు నిలిపి వేయాలని ఆదేశించారు. కాగా, ఈ నెల 5న 'ఆంధ్రజోతి'లో 'పేదోళ్లకు ఒక లెక్క పెద్దోళ్లకు మరో లెక్క' అనే కథనం ప్రచురితం కావడంతో అధికారుల్లో చలనం వచ్చింది. స్థానిక డివిజన్ వాసులు సైతం సమస్యను పశ్చిమ ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి స్పందించి బల్దియా అధికారులను ఫోన్‌చేసి పురమాయించినట్టు అక్కడి ప్రజలు తెలిపారు. దీంతో మంగళవారం ఇంజనీరింగ్ అధికారులు హుటాహుటిన రాజాజీనగర్‌కు చేరుకున్నారు. అక్కడ నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను వెంటనే నిలిపివేయాలని, ఒక్క ప్రొటెక్షన్ వాల్ పనులు మాత్రమే చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రాజాజీనగర్ బ్రిడ్జి పనులను సందర్శించిన వారిలో బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈ రవికుమార్, డీఈ సారంగం, ఏఈ మేనకలు ఉన్నారు. కాగా, బిడ్జి పనుల్లో అవకతవకలపై కథనం ప్రచురించిన ఆంధ్రజ్యోతికి రాజాజీనగర్ హెల్పింగ్ అండ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



పేదోళ్లకు ఒక లెక్క పెద్దోళ్లకు మరో లెక్క

ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్త

వికసిత్ భారత్ పోటీల్లో ప్రతిభ

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా జరిగిన వికసిత్ భారత్ పోటీల్లో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి శ్రీజా జాదవ్ సత్తాచాటారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనే అంశంపై ఢిల్లీ పార్లమెంట్‌లో జరిగిన వక్తృత్వ పోటీల్లో అనర్గళంగా మాట్లాడి దేశ స్థాయిలో గెలుపొందారు. న్యాయ నిర్ణేతలు శ్రీజా జాదవ్ ప్రతిభను గుర్తించి నెం-1గా ఎంపిక చేశారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన పోటీల్లో పాల్గొని వచ్చిన శ్రీజా జాదవ్‌ను కేయూ మొదటి గేటు వద్ద కేయూ జాతీయ సేవ పథకం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ నేతృత్వంలో అధ్యాపకులు, విద్యార్థులు స్వాగతం పలికారు. వర్సిటీలో ర్యాలీ, ప్రదర్శనలు చేపట్టారు. శ్రీజా జాదవ్‌ను గజమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీజా జాదవ్ వర్సిటీకి రాగా కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు పుష్పగుచ్ఛం, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందచేసి అభినందనలు తెలిపారు.



శ్రీజ జాదవ్‌కు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం

ప్రహర్షకు అవార్డు

మడికొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నాగపూర్‌లోని దాదాసాహెబ్ కల్మేఫ్ మెమోరియల్ డెంటల్ కళాశాల, ఆస్పత్రి ఆరో పరిశోధన అవార్డుల ప్రదానోత్సవంలో హనుమకొండకు చెందిన కేంద్రియ విద్యాలయ ఉపాధ్యాయుడు అన్నాబత్తుల వెంకన్న కుమార్తె డాక్టర్ ప్రహర్షకు పరిశోధన అవార్డు లభించింది. కళాశాల ఆడిటోరియంలో జరిగిన వేడుకల్లో పద్మశ్రీ ప్రొఫెసర్ యాదవ్ చేతుల మీదుగా ప్రహర్ష అవార్డుతో పాటు నగదు బహుమతిని అందుకున్నారు. అవార్డు రావడంపై ప్రహర్ష సంతోషంగా వ్యక్తం చేసింది.



అవార్డు స్వీకరిస్తున్న ప్రహర్ష

వేధింపులతో వివాహిత ఆత్మహత్య

ఎల్కతుర్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అత్త, భర్త వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కమలాపూర్ మండలం దేశరాజ్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీరామోజు రమేష్‌చారికి కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణానికి చెందిన హిమబిందు (36)తో 16 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వివాహ అనంతరం ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో బంగారం పనులు చేస్తూ అక్కడే స్థిరపడ్డారు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తే ఉన్నారు. అత్త లక్ష్మీ, భర్త రమేష్‌లు ఆమెను మానసికంగా వేధింపులకు గురి చేసే వారు. ఈ క్రమంలో వారి వేధింపులు భరించలేక మనస్థాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి పంచకోటి సదానందచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అక్కినపెల్లి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం హుజురాబాద్ సివిల్ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.



హిమబిందు (ఫైల్)

గంజాయి విక్రయిస్తున్న యువకులు అరెస్టు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గంజాయి క్రయ విక్రయాలు చేస్తున్న యువకులను హనుమకొండ పోలీసులు మంగళవారం అరెస్టు చేసినట్లు ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లాకు చెందిన మోతే మణికంఠ, కోటగిరి రోహిత్‌లు సులభంగా డబ్బులు సంపాదించేందుకు ద్విచక్రవాహనంపై ఒడిషాలో కల్మిల గ్రామానికి వెళ్లి నాగరాజు అనే వ్యక్తి వద్ద అరకిలో గంజాయి కొనుగోలు చేశారు. తమ దగ్గర ఉన్న గంజాయిని విక్రయించేందుకు ఇద్దరు నిందితుల్లో మణికంఠ అనే వ్యక్తి సోమవారం హనుమకొండకు రాగా, పోలీసులు పక్కా సమాచారంతో సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా తన దగ్గర గంజాయి కొనుగోలు చేసిన బాలుడితో పాటు మేకల అవినాశ్, శనిగరపు అభిలాష్, కాంతాల రాజిరెడ్డి, ఓడెల అరుణ్‌లతో పాటు వ్యాపార భాగస్వామి రోహిత్ పేర్లు వెల్లడించగా వారిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేశామన్నారు. ఈ ఘటనలో ఒడిషాకు చెందిన నాగరాజుతో పాటు మణికంఠ దగ్గర గంజాయి కొనుగోలు చేసిన వడ్డెపల్లికి చెందిన తాళ్లపల్లి చిన్ను ప్రస్తుతం పరారీలో ఉన్నారన్నారు.

సందడిగా జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ డీఎస్ఏ బాక్సింగ్ హాలులో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు ప్రారంభం అయ్యాయి. ఈ వేడుకలను బాక్సింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేందర్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెన్, ఉమెన్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో 20 మంది పాల్గొన్నట్లు తెలిపారు. ఇక్కడ జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన బాక్సర్లు ఈ నెల 11, 12 తేదీల్లో సికింద్రాబాద్ లాలాపేటలోని నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కొమ్మాల జాతర హుండీల ఆదాయం లెక్కింపు

మిశ్రమ బంగారం 12 గ్రాములు, వెండి 4 కిలోలు

గీసుగొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర హుండీల ఆదాయాన్ని మంగళవారం రెండోసారి లెక్కించారు. హుండీల ద్వారా రూ.9,16,892, వివిధ రకాల ఆర్జిత సేవలు, అర్చనల ద్వారా రూ.6,52,266 మొత్తం రూ.15,69,158 వచ్చినట్లు ఆలయ ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. అదేవిధంగా 4 కిలోల వెండి, 12 గ్రాము ల మిశ్రమ బంగారం హుండీలలో లభించినట్లు చెప్పారు. 13 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందని ఆయన వివరించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ పరిశీలకుడు అనిల్‌కుమార్, ఆలయ ధర్మకర్తల ట్రస్టీ చైర్మన్ శ్రీనివాసాచార్యులు అర్చకులు కాందూరి రామాచార్యులు, ఫణీం ద్ర, విష్ణు, వెంకటేశ్వర సేవాసమితి సభ్యులు పోలీసులు పాల్గొన్నారు.



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సేవాసమితి సభ్యులు

కర్రెగుట్టలపైకి రాకండి

- కగార్ నుంచి రక్షణ కోసం బాంబులు అమర్చాం
- తొలిసారి ప్రకటించిన మావోయిస్టులు
- వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరుతో లేఖ విడుదల

ములుగు/వాజేడు/ వెంకటాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో మావోయిస్టులకు సేఫ్ జోన్‌గా భావిస్తున్న కర్రెగుట్టలపైకి సాధారణ పౌరులెవరూ రావొద్దంటూ మావోయిస్టులు హెచ్చరించారు. కగార్ పేరిట జరుగుతున్న దాడుల నుంచి రక్షణ కోసం గుట్ట చుట్టూ బాంబులు అమర్చామని పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరిట ఓ లేఖ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ములుగు జిల్లా పరిధిలోని వాజేడు, వెంకటాపురం మండలాలను కలుపుకుంటూ కర్రెగుట్టలు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోకి విస్తరించి ఉన్నాయి. దట్టమైన అడవులు ఉన్న ఈ ప్రాంతాన్ని మావోయిస్టు గెరిల్లా బేస్‌గా మార్చుకున్నారని, భద్రతా బలగాలు లక్ష్యంగా మందు పాతరలు అమర్చారని గతంలో పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. అటు భద్రాద్రి కొత్తగూడెం, ఇటు ములుగు జిల్లాను కలిపే ఈ గుట్టలు పోలీసులు, మావోయిస్టుల చర్యలు, ప్రతిచర్యలతో నిత్యం అలజడిగా మారుతుంటాయి.

పోలీసుల మాటలు నమ్మొద్దు

ఆపరేషన్ కగార్ పేరుతో పోలీసులు ఎన్‌కౌంటర్ల పేరుతో చేస్తున్న దాడుల్లో అనేక మంది పార్టీ నాయకులు, పీఎల్‌జీఏ సభ్యులతో పాటు సాధారణ ప్రజలు బూటకపు అమరులు అవుతున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. కగార్ దాడుల నుంచి రక్షణ పొందడానికి కర్రెగుట్టలపై బాంబులు అమర్చినట్లు తెలిపారు. బాంబులు అమర్చిన విషయం ప్రజలకు వివిధ రూపాల్లో తెలిపినట్లు, అయినప్పటికీ కొద్దిమంది ఆదివాసీలు, ఆదివాసీయేతరులకు పోలీసులు మాయమాటలు చెప్పి నమ్మిస్తూ, డబ్బులు ఇస్తూ ఇన్‌ఫార్మర్‌లుగా మార్చుకొని షికారు పేరుతో కర్రెగుట్టలపైకి పంపిస్తున్నారని తెలిపారు. మావోయిస్టుల రక్షణ కోసం అమర్చిన బాంబుల బారినపడి చనిపోతున్నారని, కొంత మంది గాయపడుతున్నారని అన్నారు. పోలీసుల మాటలు నమ్మి ఇన్‌ఫార్మర్‌లుగా మారొద్దని పేర్కొన్నారు.



చర్చనీయాంశంగా మవోయిస్టుల లేఖ

ఛత్తీస్‌గఢ్‌లో నిర్బంధం ఎక్కువైన క్రమంలో తెలంగాణలోకి ప్రవేశించడానికి ఈ అడవే మావోయిస్టులకు దిక్సూచి. వారికి అడ్డుకట్ట వేసేందుకు నిఘా వేసిన పోలీసులు ప్రతిక్షణం అలర్ట్‌గా ఉంటున్నారు. ఇటీవలి కాలంలో ఛత్తీస్‌గఢ్‌లో వరుసగా భారీ ఎన్‌కౌంటర్లు జరుగుతుండగా పదుల సంఖ్యలో మావోయిస్టులు ప్రాణాలు వదలుతున్నారు. చాలామంది లొంగుబాటను ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న మావోయిస్టు లీడర్లు తెలంగాణ దండకారణ్యంలోకి వచ్చే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే మావోయిస్టుల పేరిట విడుదలైన లేఖ చర్చనీయాంశంగా మారింది. గతనెల 23న వెంకటాపురం మండలం ఇప్పగూడానికి చెందిన బొగ్గుల కృష్ణమూర్తి అనే వ్యక్తి ముత్యం ధార జలపాతం సమీపంలో అడవిలోకి వెళ్లగా ప్రెషర్ బాంబు పేలి తీవ్రంగా గాయపడ్డాడు. అంతకుముందు వాజేడు మండలం జగన్నాథపురానికి చెందిన ఇల్లందుల ఏసు అనే వ్యక్తి మరణించగా, వెంకటాపురం మండలం అంకన్నగూడానికి చెందిన నవీన్, చొక్కాల గ్రామానికి చెందిన డర్రా సునీత తీవ్రంగా గాయపడ్డారు. అయితే.. ఈ సంఘటనలను ఏనాడూ స్పందించని మావోయిస్టులు కర్రెగుట్టల చుట్టూ తాము మందుపాతరలు అమర్చామని తొలిసారి ప్రకటించారు. కగార్ పేరిట జరుగుతున్న దాడుల నుంచి రక్షణ కోసమే బాంబులు పెట్టామని, ఈవిషయాన్ని పలు రూపాల్లో ప్రజలకు తెలియపర్చినట్లు లేఖలో పేర్కొన్నారు. పోలీసులు అమాయక గిరిజన, గిరిజనేతరులకు డబ్బు ఆశగా చూపించి ఇన్‌ఫార్మర్లుగా మార్చుకుంటున్నారని, అటవీ జంతువుల వేట పేరుతో అడవుల్లోకి పంపించి తమ కదలికలను తెలుసుకుంటున్నారని తెలిపారు. ఈక్రమంలో తాము అమర్చిన బాంబులు పేలి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని వెల్లడించారు. ప్రజలెవరూ పోలీసుల మాటలను నమ్మి మోసపోవద్దని, కర్రెగుట్టలపైకి రావొద్దని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడం లేదని ఏడాది పాలనలోనే తేలిపోయిందని మావోయిస్టు నేత శాంత ఆ లేఖలో ప్రస్తావించారు. ఆరు గ్యారెంటీలతోపాటు ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్య పునఃసద్ధరణ చేస్తామని ప్రకటించి, ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని, భూస్వాములు, పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం ప్రజల ఆస్తులను బలవంతంగా గుంజుకుంటున్నారని విమర్శించారు.

బాంబు డిస్పోజల్‌తో కర్రెగుట్టలపై తనిఖీ

- ప్రజలను ఇన్‌ఫార్మర్లనడం సరికాదు
- ములుగు ఎస్పీ శబరీశ్

ములుగు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు బాంబులు అమర్చిన కర్రెగుట్టల వద్ద భద్రతా చర్యలను పటిష్ఠం చేస్తున్నామని, బాంబు డిస్పోజల్ టీమ్‌లతో నిత్యం తనిఖీలు జరుపుతూ తొలగిస్తామని ములుగు జిల్లా ఎస్పీ శబరీశ్ తెలిపారు. సరిహద్దు గ్రామాల ప్రజలు ఆందోళనకు గురికావొద్దని, ఎవరికైనా బాంబుల ఆనవాళ్లు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈమేరకు మంగళవారం మీడియాకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మావోయిస్టు పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోతోందని, ఉనికిని కాపాడుకునేందు కోసం కర్రెగుట్టల వద్ద ప్రెషర్ బాంబులు అమర్చారని తెలిపారు. అటు ఛత్తీస్‌గఢ్, ఇటు తెలంగాణ సరిహద్దు గ్రామాల ప్రజలు అటవీ ఉత్పత్తుల సేకరణే జీవనాధారంగా బతుకుతున్నారని, ఈక్రమంలో బాంబులు పేలి ప్రమాదానికి గురవుతున్నారని తెలిపారు. వారిని ఇన్‌ఫార్మర్లంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మావోయిస్టుల చర్యలను పౌరహక్కుల సంఘాలు ఖండించాలని కోరారు.



ఎండలవేళ పశువులు జాగ్రత్త

- అధిక ఉష్ణోగ్రతలతో మూగజీవాలకు ప్రమాదమే..
- పశుపోషణలో యజమానులు మెళకువలు పాటించాల్సిందే

ఖానాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో మనుషులే కాదు మూగజీవాలు కూడా వడదెబ్బకు గురవుతుంటాయి. ఎండల వేళ పశుపోషణలో మెళకువలు పాటించకపోతే వాటి ప్రాణానికి ప్రమాదమే. యజమానులకు నష్టమే మిగులుంది. అధిక ఉష్ణోగ్రతలు, గాలి ప్రసరణ సరిగా లేకపోవడం, పాకల్లో అధిక సంఖ్యలో జీవాలను కిక్కిరిసి ఉంచడం, నీళ్ల అందుబాటులో లేకపోవడం వల్ల పశువులు, గొర్రెలు, మేకలు వడ దెబ్బకు గురవుతాయి. వడదెబ్బకు గురైన పశువులు క్రమంగా నీరసించి బలహీనంగా మారుతాయి. వాటి చర్మం పొడిబారుతుంది. పశువుల సరిగా నడవలేక తూలుతూ ఉంటాయి. జీవక్రియ తగ్గిపోయి ఆకలి మందగిస్తుంది. దీంతో ఆహారం తక్కువగా తీసుకుంటాయి. పశువులు ఎదకు రాకపోగా చూడికట్టే అవకాశాలు తగ్గిపోతాయి. రోగ నిరోధక శక్తి తగ్గడం వల్ల ఇతర వ్యాధులు, పరాన్న జీవులు ఆశించే అవకాశం ఉంటుంది. చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి, ఎండ వేడిమికి దాణ సరిగా తినక పోవడం మూలంగా పాల దిగుబడి తగ్గిపోతుంది. ఎండ నుండి పశువులను రక్షించుకుంటేనే పాడి పోషణ లాభదాయకంగా ఉంటుంది.

పాకల్లో చల్లదనం కోసం ఏర్పాట్లు

పశువుల పాకల్లో పైకప్పులకు తెల్లరంగు వేసి ఆపై గడ్డి, తాటి, కొబ్బరి వంటి ఆకుల్ని పరచడం లాంటి చర్యల ద్వారా ఎండ వేడి షెడ్లలోకి ఎక్కువగా ప్రవేశించకుండా చూడవచ్చు. మధ్యాహ్న సమయంలో పాకల చుట్టూ గోతాలు, పరదాలు వేలాడదీసి వాటిని తరుచు నీటితో తడపడం మంచిది. అత్యధిక పాలిచ్చే సంకరజాతి ఆవులు, ముర్రా గేదెలకు ఫ్యాన్లను ఏర్పాటు చేయడం ఎంతో అవసరం. పశువుల పాకలను ఎప్పటికప్పుడూ శుభ్రం చేస్తూ గాలి ధారాళంగా ప్రసరించే విధంగా చూడాలి. పశువులను రోజుకు రెండు మూడు సార్లు చల్లని నీటితో కడగాలి.

మెళకువలు పాటించాలి

వేసవిలో పశువులకు అందించే మేత, దాణాలో మెళకువలు పాటిస్తేనే పాడి పోషణ లాభాదాయకంగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో మేతకు తీసుకెళ్లాలి. వేసవి తాపంతో పశువుల్లో జీర్ణక్రియ మందగిస్తుంది. అందువల్ల సులువుగా జీర్ణించుకునే పిండి పదార్థాలైన గంజి, జావ వంటివి అందించాలి. ఎక్కువ శాతం పచ్చిగడ్డి అందించాలి. మాగుడు గడ్డి ఉంటే సంవృద్ధిగా అందించాలి. పచ్చిగడ్డిని ఉదయం, ఎండు గడ్డిని రాత్రి సమయాల్లో కత్తిరించి ఇవ్వాలి. అధిక పాలు ఇచ్చే పశువులకు దాణాతో నీటిని కలిపి ఇవ్వాలి. మినరల్ మిక్చర్, ఉప్పు కలిపిన ద్రావణం ఇవ్వడం మరీ మంచిది. అలాగే వేసవిలో పశువుల్లో తాగునీటి అవసరాలు రెట్టింపవుతాయి. చల్లని శుభ్రమైన నీటిని పశువులకు ఎప్పుడూ అందుబాటులో ఉంచాలి. నీటి తొట్లను నీడలో ఉంచాలి. సాధ్యమైనంత వరకు ఎక్కువ నీళ్ల తాగేలా చూడాలి.

టీకాలు తప్పనిసరి

ఎండాకాలంలో పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. దీంతో పశువులు సులువుగా జబ్బుల బారినపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గొంతు, జబ్బవాపు, గాలికుంటు వంటి వ్యాధులు రాకుండా టీకాలను ఇప్పించాలి. అంతర పరాన్న జీవుల నిర్మూలనకు నట్టల మందులను తాగించాలి.

పశువుల్లో వడదెబ్బ లక్షణాలు..

నివారణోపాయాలు

వడదెబ్బకు గురైన పశువుల్లో నాలుక బయట పెట్టడం, నీరు తాగకపోవడం, మేత తినకపోవడం, మూత్ర విసర్జన ఆగిపోవడం లాంటి లక్షణాలు కలిపిస్తాయి. ముట్టెపై చెమట లేకపోవడం, కళ్లలో ఎర్రటి చారలు, నెమరు వేయలేకపోవడం తదితర లక్షణాలు ఉంటాయి. ఈ లక్షణాలు పశువుల్లో కనిపించిన వెంటనే ఉప్పు, బెల్లం కలిపిన ద్రావణం తాగించాలి. నిత్యం నాలుగైదు సార్లు చల్లని తాగునీటిని అందించాలి. పశు వైద్యుడి సహాయంతో చికిత్స అందించాలి.

పశువులకు వెంటనే చికిత్స చేయించాలి

శ్రీలక్ష్మి, పశువైద్యాధికారి, ఖానాపురం



వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వచ్చే ప్రదేశంలోకి తీసుకెళ్లాలి. శరీర ఉష్ణోగ్రతను తగ్గించేందుకు పలుమార్లు నీటితో కడగాలి. చల్లని గోనె సంచిని కప్పడం లాంటివి చేయాలి. పశువైద్యుడి పర్యవేక్షణలో చికిత్స అందించాలి. వైద్యాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.

కాళేశ్వరం.. మునులు, రుషుల తపోక్షేత్రం

- భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న ముక్తీశ్వరుడి సన్నిధి
- ఈ ఏడాది సరస్వతీ పుష్కరాల వైభవం



కాళేశ్వర ఆలయం

మహదేవపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : భక్తుల కొంగు బంగారంగా.. బ్రహ్మ విద్యల తపోక్షేత్రంగా.. ఎందరో రుషులు, మునులు తపస్సులు చేసిన పుణ్యస్థలంగా.. ఎన్నో పాతకాలను పారదోలిన శైవ క్షేత్రంగా.. వేదకాలం నుంచి స్వచ్ఛ గోదావరి తరగలతో జన్మ తరింపజేసుకున్న పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది కాళేశ్వరం. బ్రాహ్మణ అగ్రహారాలుగా విశ్వ విఖ్యాతి గాంచిన మంత్రకూటం, చెన్నూరు, కాళేశ్వరం పుణ్యతీర్థ క్షేత్రాలు.. సంప్రదాయ షట్శాస్త్రాలు, పురాణ ఇతిహాసాలను పఠించి భావితరాలకు అందజేసిన జాబాలి, అగస్త్యుడు, గౌతముడు నడయాడిన కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహితల మధ్యలో అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతి నదికి ఈ ఏడాది పుష్కరాల వైభవం సంతరించుకుంది. వేదవ్యాస మహర్షి స్కంద పురాణంలో కాశీ ఖండంలో పేర్కొన్న సమాచారం కాళేశ్వర క్షేత్రం ప్రసిద్ధిగా నిలుస్తోంది. భారతదేశ యాత్ర ప్రారంభించిన అగస్త్య మహర్షి గోదావరి జన్మస్థానమైన నాసిక్ త్రయంబకం క్షేత్రంలో స్నానమాచరించి వ్యాస ప్రతిష్ఠ సరస్వతిని దర్శించి కాళేశ్వరంలో త్రివేణి సంగమంలో స్నానమాచారించారు. తన యాత్రకు గుర్తుగా చెన్నూరులో అగస్త్యేశ్వరస్వామి లింగ ప్రతిష్ఠ చేయించారు. నేటికీ చెన్నూరు ఆలయంలో అగస్త్యేశ్వరుడి పురాతన ఆలయంలో పూజలు కొనసాగుతున్నాయి. 400 ఏళ్లుగా అఖండ జ్యోతి దీపం వెలుగుతుండడం విశేషం. అలాంటి ఎంతో విశిష్టతలు కలిగిన ఈ పుణ్యక్షేత్రాన్ని సరస్వతీ పుష్కరాల వేళ దర్శించుకుంటే ఎంతో మంచిదని పండితులు చెబుతున్నారు. వచ్చేనెలలో సరస్వతీ పుష్కరాల వేళ కాళేశ్వరం చరిత్ర గురించి ప్రత్యేక కథనం.

- సహజ కవి బమ్మెర పోతన తెలుగులో మహా భాగవతం రాయాలనే తపనతో ఏమి తోచని పరిస్థితిలో కాళేశ్వరం అంతర్వాహిని సరస్వతి త్రివేణి సంగమంలో స్నానం చేసి శ్రీకారం చుట్టినట్టు అభినవ పోతన వానమమలై వరదాచార్యులు రాసిన పోతన చరిత్రము తెలుపుతోంది. గౌతమ మహర్షి శిష్యులకు వేద పఠనం చేస్తున్న సమయంలో మంత్ర కూటం ప్రాంతంలో కరువు కాటకాలు వచ్చాయి. తపోబలంలో ఏ రోజుకారోజు పంట పండించి శిష్యులకందిస్తే అసూయపరులు కుట్రలతో మాయా ధేనువు సృష్టించిన వేళ దర్భ కర్రతో అదిలించగా గోవు మృతిచెంది గౌతమ మహర్షికి గోహత్యా పాతకం కలిగింది. నివారణ కోసం కాళేశ్వరంలో సరస్వతీ మాతను దర్శించి శివుడి కోసం తపస్సు చేసుకుని గోదావరితో కూడిన మహాసరస్వతిని దర్శించడంతో గోహత్యా దోషం నివృత్తి కలిగిందని, అందుకు సాక్ష్యమే మంత్రకూటంలో గౌతమేశ్వరాలయమని కాళేశ్వర ఖండంలోని కథనం చెబుతోంది.
- కాళేశ్వరం క్షేత్రంలో అష్టతీర్థాలు శివుని ఎనిమిది రకాల రూపాలకు సాక్ష్యాన్ని కథలున్నాయి. కొందరు దొంగలు ప్రతి రోజు కాళేశ్వరం ప్రాంతంలో దొంగతనాలు చేసి తెల్లవారుజామున పరుగెత్తి వెళ్లేవారు. రాజులు వేసిన శిక్షలు అనుభవించి బాధపడేవారు. జాబాలితో సహా పస్తర్షులు ఎదురుపడి పాప పరిహారం కోరారు. వారు గోదావరి నీరు చల్లగానే ప్రాణాలు కోల్పోయారు. రుషులకు బ్రహ్మత్యా పాతకం కలగ్గా నివారణకు కాళేశ్వరం చేరి సరస్వతి సంగమంలో స్నానం చేసి పునీతులయ్యారట. తర్వాత కొన్నాళ్లకు రుషులు కాశీకి వెళ్లగా నాటి దొంగలే మహారాజులుగా కనిపించి రుషులను గౌరవించి ఆదరించారు. కాశీలో విద్యాలయాల్లో కాళేశ్వరం అంతర్వాహిని సరస్వతి త్రివేణి సంగమం ప్రాచుర్యాన్ని ప్రచారం చేయించారు.
- త్రేతాయుగంలో శ్రీరాముడు పంచవటిలో సీతాపహరణం జరిగిన తర్వాత భరించరాని తాపంతో ప్రయాణిస్తూ కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహిత, సరస్వతి త్రివేణి సంగమంలో స్నానమాచరించి ముక్తీశ్వరుడిని పూజించారట. సుగ్రీవుని చొరవతో దేశంలోని రుషులందరిని పిలిపించి యజ్ఞయాగాలు చేయించనట్లు పురాణాలు చెబుతున్నాయి. కాళేశ్వరం నదీతీరంలో హనుమత్ తీర్థం, వీరాంజనేయస్వామి దేవాలయం, శ్రీ సీతారామ చంద్రమూర్తి ఆలయాలు అందుకు సాక్ష్యాలుగా ఉన్నాయని వేదపండితులు చెబుతున్నారు.
- ఇక శివతత్వాన్ని గ్రామీణులకు వివరించేందుకు పదకొండో శతాబ్దంలో నీలకంఠేశ్వరాధ్యుడు ఎంతో కృషి చేశాడు. నారదబ్రహ్మ సూత్రాలకు వ్యాఖ్యానం రాసి.. గోదావరి పరివాహక ప్రాంతం మధ్యాచార్యుల తీరంలో సోన్‌సమీపంలో నిర్మల్‌కు చెందిన నిర్మల శంకరశాస్త్రీ నీలకంఠేశ్వర వ్యాఖ్యానానికి వివరణ, విశ్లేషణ రాశారు. ఆ గ్రంథంపై ప్రముఖ తత్వవేత్త, పూర్వ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ముందుమాట ఉపోద్ఘాతం రాయడం విశేషం. కాళేశ్వరం, చంద్రువెల్లి ప్రాంతాల్లో వేద పాఠశాలలు నెలకొల్పి వీరభద్ర పండిత శివారాధ్యులు కాళేశ్వరం సరస్వతీ క్షేత్ర మహిమలు ఎల్లవేళలా ప్రాచుర్యం పొందేలా చేశారు. కాకతీయుల సామ్రాజ్యంలో విద్యారణ్యుల శిష్య పరమాణువు కాళేశ్వరం రాజయ్యారాధ్యులు కాళేశ్వర ఖండం గ్రంథం ముద్రణలో చొరవ చూపారు. కాకతీయులు కాళేశ్వరం త్రివేణి సంగమంలో రాజు శీరం బరువుకు సమానమైన ధనం తులా పురుషదానం చేసి తరించినట్టు గయా క్షేత్రంలో లభించిన శాసనం ద్వారా తెలుస్తోంది. ఈ విధంగా సరస్వతీ అంతర్వాహినిగా ఉన్న గోదావరిలో సరస్వతీ పుష్కరాల సమయంలో స్నానం చేయడం ద్వారా పిల్లలకు విద్యా విజ్ఞానం పెరుగుతుందని, అది తమ అదృష్టమని భక్తులు భావిస్తారు.

పట్టాలు పొందిన వేళ.. ఆనంద హేల

- అట్టహాసంగా కేఎంసీ 61వ గ్రాడ్యుయేషన్ డే
- ఆనందంతో పులకరించిన తల్లిదండ్రుల మనసులు
- వైద్యులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలి : కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి



కూతురు పట్టా అందుకున్న ఆనందంలో తల్లిదండ్రులు



విద్యార్థికి ఎంబీబీఎస్ పట్టా అందజేస్తున్న కాళోజీ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి, కేఎంసీ ప్రిన్సిపాల్ రామ్‌కుమార్‌రెడ్డి, తదితరులు

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెడికల్ కళాశాలలో 61వ గ్రాడ్యుయేషన్ డే మంగళవారం రాత్రి అట్టహాసంగా జరిగింది. 2019 బ్యాచ్‌కు చెందిన 230మంది విద్యార్థులు ఎంబీబీఎస్ పట్టాలు అందుకోగా.. వారిని చూసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పులకించిపోయారు. ఆనందంతో వారిని ముద్దాడారు. తమ కలలు సాకారం చేశారంటూ ఆనందం వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ నందకుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు పట్టాలు అందజేసిన ఆయన మాట్లాడుతూ.. సమాజ ఆరోగ్య వికాసానికి వైద్యులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, యువ వైద్యులు నిబద్ధతతో వృత్తి ధర్మాన్ని పాటించాలని సూచించారు. వైద్యుడిని దేవునితో సమానంగా కొలిచే సమాజంలో ఉన్నామన్న విషయాన్ని మరువొద్దని, ప్రజల్లో ఉన్న ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా యువ వైద్యులు కృషి చేయాలని కోరారు. అంకితభావమున్న వైద్యు లను సమాజం ఆదర్శవంతంగా చూస్తుందని అన్నారు. ఇదే కళాశా లలో పట్టాలు పొందిన అనేక మంది వైద్యులు విశిష్టమైన సేవలు అందించి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని కొనియాడారు. ఇలాంటి స్ఫూర్తి దాయకమైన కేఎంసీ నుంచి పట్టాలు పొందిన యువ వైద్యు లు అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అలాగే ఎంత ఎత్తు ఎదిగినా తాము చదువుకున్న కళాశాల, అధ్యా పకులు మరవకూడదని హిత వు పలికారు. ఈ కార్యక్ర మంలో కాళోజీ నారాయణ రావు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సంధ్య, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ విజయలక్ష్మీ, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ మురళీ తదితరులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డేలో మాట్లాడుతున్న కాళోజీ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి

న్యూరో సర్జన్ అవుతా..

పిన్నింటి భార్గవి



ఎంబీబీఎస్ పట్టా పొందటం ఆనందంగా ఉంది. న్యూరో సర్జన్ కావాలని లక్ష్యంగా పెట్టుకున్నా. మా అమ్మ పద్మశ్రీ, నాన్న వెంకటేశ్వర్‌రావు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. చిన్నప్పటి నుంచి వారు అందించిన ప్రోత్సాహంతోనే నేను వైద్య విద్య వైపు వచ్చా. వైద్య విద్య పూర్తి చేసిన మా పెదనాన్న కొడుకు కూడా నాకు స్ఫూర్తి. భవిష్యత్‌లో ఆరోగ్య వికాసానికి సేవలందిస్తా.



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

పచ్చదనానికి ప్రణాళిక సిద్ధం

- హరితహారానికి మొక్కలు సన్నద్ధం
- ముమ్మరంగా బ్యాగ్ ఫిల్లింగ్ పనులు
- మండలంలో 3.90 లక్షల మొక్కల లక్ష్యం

నెక్కొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అంతరించిన అడవులకు ఊపిరి పోయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు హరితహారం తోడ్పడనుంది. త్వరలో నిర్వహించనున్న పదకొండో విడత హరితహారం విజయవంతం చేయడానికి అధికారులు మొక్కలు సిద్ధం చేస్తున్నారు. మొక్కలు నాటడంతో అంతరించిపోతున్న అడవులకు ఊపిరి పోయడమే కాకుండా, వర్షాలు సమృద్ధిగా కురవడానికి, వాతావరణంలో కాలుష్య నివారణకు పచ్చదనం ఎంతో ముఖ్యమని ప్రజలకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. హరితహారం కోసం అవసరమైన మొక్కలు పెంచడానికి మట్టి, విత్తనాల సేకరణపై అధికారులు దృష్టి పెట్టారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా హరితహారం కోసం నెక్కొండ మండలం లోని 39 గ్రామపంచాయతీలలో నర్సరీలను ఏర్పాటుచేసి వాటిలో మొక్కలు పెంచుతున్నారు. ఈ నర్సరీలలో 3.90లక్షల మొక్కలు పెంపకం లక్ష్యంగా పెట్టుకొని ప్రణాళికలను సిద్ధంచేశామని సంబంధిత అధికారులు తెలిపారు.

6 నుంచి 8 వేల మొక్కల పెంపకం లక్ష్యం

గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీలో 6 నుంచి 8 వేల మొక్కలను పెంచడానికి అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం నర్సరీల్లో బెడ్‌ల ఏర్పాటు, ప్లాస్టిక్ కవర్లలో మట్టి నింపే పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి నర్సరీలకు విత్తనాలను ఆరు నెలల కిందటే సరఫరా చేశారు. పూల మొక్కలు, పండ్ల మొక్కలైన బొప్పాయి, జామ, నిమ్మ, సీతాఫలం, రామాఫలం, నారింజ, నేరేడుతో పాటు వృక్ష సంబంధిత మొక్కలైన గుల్‌మోహర్, వేప, కానుగ, టెంటపోరం, మునగ, టెకోమా పెంచుతున్నారు.



ప్లాస్టిక్ కవర్లలో మట్టి నింపి మొక్కలు నాటుతున్న కూలీలు



మొక్కల కలుపు తీస్తున్న కూలీలు

పక్షుల నుంచి రక్షణకు..

నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండ తీవ్రతనుంచి తట్టుకోవడానికి రోజుకు కనీసం మూడుసార్లు నీరు అందిస్తున్నారు. అలాగే మొక్కలకు ఎండ తీవ్రత నుంచి రక్షణకు గ్రీన్ పట్టాను ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల ఎండ తీవ్రత నుంచి తట్టు కోవడంతోపాటు, పక్షుల నుంచి కూడా రక్షణ ఉంటుంది.

మల్టీలేయర్ పద్ధతిలో..

నర్సరీలో పెంచిన మొక్కలను హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు, దేవాలయాల అవరణలో, కాలువ, చేరువుల గట్లపై, రోడ్డు వెంట మల్టీలేయర్ అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టనున్నట్లు అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే నర్సరీలో పెంచిన మొక్కలను పల్లె ప్రకృతి వనాలకు సరఫరా చేస్తామన్నారు.

ఉపాధి పథకం ద్వారా..

గ్రామాల్లో వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీలు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా నర్సరీల్లో మొక్కల పెంపకం ద్వారా కూలీలకు పనులు దొరుకుతున్నాయి. నర్సరీలో పనులు చేస్తున్న కూలీలకు రోజుకు రూ.250 వరకూ కూలి పొందుతున్నారు.

మూడు నెలల్లో మొక్కలు సిద్ధం

వి.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో, నెక్కొండ



గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహిస్తున్న నర్సరీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మొక్కలను హరితహారానికి సిద్ధం చేస్తున్నారు. మూడు నెలల్లో వచ్చే జూన్ నాటికి 3.90లక్షల మొక్కలు అందిస్తాం. నర్సరీల నిర్వహణ విషయంలో గ్రామ సర్పంచ్, కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.

ఇంటింటికీ ఆరు మొక్కల పంపిణీ

యాదగిరి, గుండ్రపల్లి నర్సరీ వాచర్



వర్షాకాలం ఆరంభంలో మండలంలోని గ్రామాల్లో మొక్కలను పంపిణీ చేయడానికి సిద్ధం చేస్తున్నాం. ప్రతీ మొక్క ఎదిగేందుకు కవర్లలో మొక్కతో పాటు పెరుగుతున్న కలుపు తీస్తున్నాము. ప్రతీ ఇంటికి పండ్లు, పూల మొక్కలు ఆరు చొప్పున పంపిణీ చేస్తాం. మొక్కలు ఎండకు ఎండకుండా నిత్యం నీరు పడుతున్నాం.

ఆ ఉపాధ్యాయుడు.. ఆదర్శప్రాయుడు

- వృత్తిపై అంకితభావం.. సేవే ఆయన మార్గం
- తొమ్మిది 'ఉత్తమ' అవార్డులు అందుకున్న శ్రీనివాస్

పర్వతగిరి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆయన ఉపాధ్యాయుడిగా వృత్తిలోనే కాదు సమాజ సేవలోనూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎంతో మంది విద్యార్థులకు చదువు చెప్పడమే కాదు వారి తల్లిదండ్రులతో మమేకమై ఆ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పునాది వేశారు. అంతే కాదు పర్యావరణ పరిరక్షణపైనా ప్రత్యేక శ్రద్ధ చూపడం, సామాజిక సేవాభావం కలిగిన ఆయన తొమ్మిది సార్లు ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు అందుకుని తనకంటూ ప్రత్యేక స్థానాన్ని నిలుపుకొన్నారు. ఆయనే వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అప్పల్‌రావుపేట గ్రామానికి చెందిన మడత కొంరయ్య, మడత ఎల్లమ్మ దంపతుల కుమారుడు మడత శ్రీనివాస్. పేదకుటుంబంలో పుట్టిన శ్రీనివాస్ పాఠశాల స్థాయి విద్యాభ్యాసామంతా ప్రభుత్వ పాఠశాలలోనే పూర్తి చేశారు. బీకాం సీకేఎం కళాశాలలో 1983-86వరకు పూర్తి చేసి అనంతరం కాకతీయ యూనివర్సిటీలో 1986-88లో ఎంకాం పూర్తిచేసి 1988-89లో వరంగల్‌లోని బీఈడీ కళాశాలలో చదివారు. 1989లో డీఎస్సీకి ఎంపికై డిసెంబరు 1990లో వరంగల్ జిల్లా నెక్కొండ మండలం వెంకటాపూర్ ఎంపీపీఎస్‌లో స్పెషల్ టీచర్‌గా ఉద్యోగంలో చేరారు. అక్కడ 1992 వరకు పనిచేసి అనంతరం అదే ఏడాది ఆగస్టులో పెద్దకొర్పోల్ జడ్పీహెచ్ఎస్‌కు బదిలీ అయ్యారు. అక్కడ 2002 వరకు పనిచేసి అనంతరం 2006లో ఎంపీపీఎస్‌లో హెచ్ఎంగా పదోన్నతి పొందారు. అదే సంవత్సరంలో డోర్నకల్ మండలం పెరుమండ్ల సంకేసి జడ్పీహెచ్ఎస్‌కు బదిలీ అయి.. 2009 జూలై వరకు పనిచేసి పర్వతగిరి మండలంలోని ఎంపీయూపీఎస్‌కు బదిలీపై వెళ్లారు. అక్కడ 2018వరకు ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి విద్యారంగ అభివృద్ధికి తోడ్పాటునందించారు. జూలై 2018లో అదే మండలంలోని బూర్గుమల్ల ఎంపీయూపీఎస్‌కు బదిలీ అయి హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ఇలా 15 సంవత్సరాల పాటు ఉపాధ్యాయునిగా, 20 ఏళ్ల పాటు ప్రధానోపాధ్యాయునిగా వివిధ పాఠశాలల్లో పనిచేసి తనదైన ముద్రను వేసుకున్న ఆయన ఈ నెలాఖరులో పదవీవిరమణ పొందబోతున్నారు.

వృత్తిలోనే కాదు.. సేవల్లోనూ అంకితభావం..

ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్న సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, వారికి అవగాహన కల్పించి మరీ పాఠశాలలను కాపాడడంలో శ్రీనివాస్ కీలక భూమిక పోషించారు. ప్రధానంగా బస్సు మార్గంలేని తండాలలో కొంత వరకు సొంత ఖర్చులు వెచ్చించి ప్రైవేటు వాహనాల ద్వారా పిల్లలను స్కూల్‌కు రప్పించారు. 35 ఏళ్ల ఉపాధ్యాయ జీవితంలో ఏ రోజు కూడా గైర్హాజరైన దాఖలాలులేవని తోటి ఉపాధ్యాయులు చెబుతున్నారు. అత్యవసరమైతే చట్టపరమైన సెలవుతీసుకుంటారు. అంతేకాదు.. ఏదైనా రోజు ఒక్క నిమిషం ఆలస్యమైనా.. సగం పూట సెలవు పెట్టి మరీపాఠాలు బోధించి వెళ్తారట. పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం అతను అందించే ఆర్థిక సహకారాలు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం అందరినీ ఆకట్టుకుంటుంది. ఒక్కో సందర్భంలో పాఠశాల అభివృద్ధి కోసం తన సొంత డబ్బును ఖర్చుచేయడమే కాకుండా గ్రామస్థులు, నాయకులతో మాట్లాడి నిధులు సేకరించారు. ఇక పర్యావరణ హితం కోసం కృషి చేయడంతో పాటు.. తోటి ఉపాధ్యాయులను కూడా ఆ దిశగా నడిపిస్తున్నారు. తాను పనిచేసిన పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రత కోసం పలు కార్యక్రమాలు చేపట్టారు.

అందుకున్న అవార్డులు..

మడత శ్రీనివాస్ అందించిన సేవలకు గాను విద్యాశాఖ గుర్తించి అనేక అవార్డులు అందించింది. ఇందులో ప్రధానంగా 2001 సంవత్సరంలో నర్సంపేట డివిజన్ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడును అవార్డును ప్రతిభా సేవా సంస్థ ఆధ్వర్యంలో అందుకున్నారు. 2011 సెప్టెంబరు 5న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా కలెక్టర్ అవార్డు అందజేశారు. 2012లో పర్వతగిరి మండలంలో బెస్ట్ హెచ్ఎంగా మారీ స్వచ్ఛంద సంస్థ అవార్డు ప్రదానం చేసింది. అలాగే 2019 సెప్టెంబరులో మరోసారి జిల్లా స్థాయి అవార్డు అందుకున్న శ్రీనివాస్ 2022లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల స్థాయిలో ఎంఈవో నుంచి ప్రశాంసా పత్రాన్ని అందుకున్నారు. 2023 సెప్టెంబరులో కలెక్టర్ నుంచి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నారు.



శ్రీనివాస్ (ఫైల్)



2023లో కలెక్టర్ నుంచి అవార్డును అందుకుంటున్న శ్రీనివాస్ (ఫైల్)



ప్రస్తుతం శ్రీనివాస్ విధులు నిర్వర్తిస్తున్న బూర్గుమల్ల పాఠశాల

జాబ్‌మేళాకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

అధికారులకు కలెక్టర్ సత్యశారద ఆదేశాలు

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11వ తేదీన వరంగల్ బస్టాండ్ సమీపంలోని సీకే నాయుడు కన్వెన్షన్ హాల్‌లో జరిగే మెగా జాబ్‌మేళాకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. ఈ విషయంపై మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వాహకులు, అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రత్యేక చొరవ తీసుకొని వరంగల్ జిల్లా యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పించాలనే ముఖ్య ఉద్దేశంతో టాస్క్ సంస్థ సౌజన్యంతో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 11వ తేదీన ఉదయం 9.30 గంటల నుంచి జరిగే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెగా జాబ్‌మేళాపై వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ప్రత్యేక అధికారి శ్రీరాములు శ్రీనివాస్, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, ఏసీపీ నందిరాం నాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వాణిజ్య పన్నుల శాఖలో బదిలీలు చేపట్టాలి

కమిషనర్ హరితకు ఉద్యోగుల సంఘం వినతి



కమిషనర్ హరితకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగుల సంఘం నాయకులు

వరంగల్‌టౌన్, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తున్న జూనియర్, సీనియర్ అసిస్టెంట్లను వెంటనే బదిలీ చేయాలని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్, వరంగల్ డివిజన్ అధ్యక్షుడు కె.గోపికిశోర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ కె.హరితకు వినతిపత్రం ఇచ్చారు. వాణిజ్య పన్నుల శాఖలో కొన్ని సంవత్సరాల నుంచి బదిలీలు లేక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో బి.రమేష్, కె.జగదీష్, ఎంఎం శర్మ ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 20 మందికి జరిమానా

మట్టెవాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో 20 మందికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేష్ మంగళవారం రూ.20,800 జరిమానా విధించారు. ఇదే కేసులో ములుగు జిల్లా ఏటూర్‌నాగారానికి చెందిన కావేరి నగేష్‌కు, మహబూబ్‌నగర్‌కు చెందిన తీరులపురం శివుడుకు రెండు రోజుల జైలుశిక్ష, రూ.1000 చొప్పున జరిమానా విధించారు. అదేవిధంగా లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఇద్దరికి రూ.1000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు.

రజతోత్సవాలను జయప్రదం చేయాలి

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు ఎల్లావుల లలితా యాదవ్



నినాదాలు చేస్తున్న లలితా యాదవ్, పార్టీ నాయకులు

మామునూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలకేంద్రంలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవాలను జయప్రదం చేయాలని రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షురాలు ఎల్లావుల లలితా యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం నాయుడు పెట్రోల్ పంపు వద్ద నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. సిల్వర్ జూబ్లీ వేడుకలకు ప్రతీ డివిజన్ నుంచి పార్టీ కార్యకర్తలను పెద్ద ఎత్తున తరలించాలని నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉద్యమకారులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

- మేయర్ గుండు సుధారాణి
- బల్దియా కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ



బల్దియా డెత్, బర్త్ సెక్షన్ సిబ్బందితో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బల్దియా సిబ్బంది సమయపాలన పాటించి విధులకు హాజరు కావాలని మేయర్ గుండు సుధారాణి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని వివిధ విభాగాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇన్‌వార్డు, కంట్రోల్ రూమ్, ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్, పెన్షన్ సెక్షన్, డెత్, బర్త్ సెక్షన్, అకౌంట్స్ సెక్షన్‌లతో కలియతిరిగారు. అక్కడ విధులు నిర్వర్తించే సిబ్బందితో మాట్లాడి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. బల్దియా కార్యాలయంలో పార్కింగ్ చేసే ప్రైవేటు వ్యక్తుల వాహనాలను గుర్తించి సెల్లార్‌లో పార్కింగ్ చేయకుండా చూడాలని సెక్యూరిటీ సిబ్బందిని దేశించారు. అంతే కాకుండా బల్దియా కార్యాలయం అవరణలో ఉన్న చెత్తను అక్కడి నుంచి తొలగించాలని, చాలా కాలంగా పాడైపోయిన మరుగుదొడ్లను మరమ్మతు చేయాలని తెలిపారు. ఇంకా సిబ్బంది జాబ్‌చాట్‌ను తెలుసుకుని రిజిస్టర్‌లను పరిశీలించారు. పరిపాలనా విభాగానికి రంగులు వేయాలని ఇంజనీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. అనంతరం కౌన్సిల్‌హాల్ పునరుద్ధరణ పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, హెచ్‌వోలు రమేష్, లక్ష్మారెడ్డి, జేఏవో జగదీశ్వరి, సూపరింటెండెంట్ ఆనంద్ పాల్గొన్నారు.

- **మేయర్‌ను కలిసిన బల్దియా ఎలక్ట్రికల్ సిబ్బంది**

బల్దియా ఔట్‌సోర్సింగ్ ఎలక్ట్రికల్ సిబ్బంది మంగళవారం మేయర్ గుండు సుధారాణిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ సిబ్బంది మాట్లాడుతూ.. బల్దియా పరిధిలో చాలా కాలంగా తక్కువ జీతంలో పని చేస్తున్నామని, జీతాలు పెంచాలని మంత్రి కొండా సురేఖతో పాటు ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి వినతిపత్రాలు అందించామన్నారు. తమ వేతనాలు పెంచడానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మేయర్‌ను కలిసిన వారిలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు.

రామాలయంలో కొనసాగుతున్న కల్యాణోత్సవాలు



రంగశాయిపేట రామాలయంలో పూజలు చేస్తున్న వేదపండితులు

శంభునిపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రంగశాపేటలోని రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వారం రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలు నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అంతకు ముందే పూజారి తిరుమల శ్రీధరాచార్యులు, వేద బ్రాహ్మణులు వెలిదె భార్గవ శర్మ, ప్రదీప్ శాస్త్రి అట్టహాసంగా బలిహరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

- **చిన్న రథంపై ఊరేగిన సీతారాములు..**

రాత్రి బలిహరణ కార్యక్రమం అనంతరం సీతారాములతో పాటు లక్ష్మణ, హనుమాన్ ఉత్సవ విగ్రహాలను చిన్న రథంపై ఆసీనులను చేసి ఊరేగించారు. భక్తులు దారి పొడుగునా మంగళహారతులు పట్టారు. జై శ్రీరామ్ అంటూ భక్తులు చిన్నరథాన్ని లాగారు. ఆలయం నుంచి బయలు దేరిన శోభాయాత్ర హనుమాన్ ఆలయం, గాంధీ జంక్షన్, గడి సెంటర్, పోచమ్మ ఆలయం, బొడ్రాయి గుండా ఆలయానికి చేరుకుంది. ఈ కార్యక్రమాల్లో స్థానిక 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్, పీఏసీఎస్ చైర్మన్ కేడల పద్మజనార్దన్, ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ పులిగిళ్ళ వెంకట రామనరసింహ రామకృష్ణ శాస్త్రి, ఈట ఎన్.వెంకట్‌రావు, వలుపదాసు కృష్ణ, బిట్ల శ్రీనివాస్, బొలుగొడ్డు అనిల్, శ్రీరామ భజన మండలి, మహిళా విభాగం, ఉత్సవ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.



చిన్న రథం పై ఊరేగుతున్న సీతారాములు

పేదలు సన్న బువ్వ తినాలన్నదే కాంగ్రెస్ లక్ష్యం

కార్యకర్త ఇంట్లో భోజనం చేసిన ఎమ్మెల్సీ సారయ్య

గిర్మాజీపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్ 20 డివిజన్ శాంతినగర్‌లో కాంగ్రెస్ కార్యకర్త జన్ను వేణు ఇంట్లో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మంగళవారం సన్న బియ్యంతో భోజనం చేశారు. స్థానిక కార్పొరేటర్ గుండేటి నరేందర్ కుమార్, పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. పేదలు కూడా సన్న బియ్యం అన్నం తినాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేషన్ షాపుల ద్వారా ఉగాది నుంచి ఉచితంగా సన్నబియ్యం ఇస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొరివి పరమేశ్వర్, దూపం సంపత్, టి.లక్ష్మణ్, జన్ను రవి, గోరంటల రాజు, మార్త ఆంజనేయులు, శేఖర్, బంజిరాల వేణు, ప్రశాంత్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణాలు అందించాలి

బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌వీర్ యాదవ్



కలెక్టరేట్ ఎదుట మాట్లాడుతున్న బీజేవైఎం నాయకులు

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌వీర్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే రుణాలు అందుతాయని బయట ప్రచారం జరుగుతోందని, దీన్ని ఖండించాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులపై ఉందని అన్నారు. అర్హులందరికీ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు ఎ.శ్రవణ్, రాపాక ప్రశాంత్, ఆర్.మున్న, యూ.వినయ్, పి.మహంత్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మట్టెవాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కరాటేలో అత్యంత ప్రతిభ కనబర్చిన విద్యార్థులు సోమవారం సాయంత్రం తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్లు అందుకున్నారు. వరంగల్ ఏవీవీ జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో 333 మంది కరాటే క్రీడాకారులు ఒకే స్టేజీపై ఒకేసారి నాన్‌స్టాప్ డెమో 3 గంటలపాటు ఏకధాటిగా డెమో చేసి తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సాధించినట్లు వరంగల్ జిల్లా షోటో ఖాన్ అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా తెలిపారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి సర్టిఫికెట్లు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే కోచ్, వరంగల్ జిల్లా షోటోఖాన్ సెక్రటరీ ఎండీ.సలీం పాషా, సీనియర్ కరాటే మాస్టర్లు, తెలంగాణ రాష్ట్ర షోటోఖాన్ అధ్యక్షుడు ఊరుగొండ చంద్రశేఖర్, తెలంగాణ పోలీస్ కరాటే కోచ్ పాయం సురేశ్, భైరి మహేందర్, టీవీ అశోక్ కుమార్, సైకాలజిస్టు బరుపాటి గోపి, సతీష్, పుష్పలత తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వర్సిటీల్లో కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, డాక్టర్ పి. కరుణాకర్‌రావులు డిమాండ్ చేశారు. మంగళవారం కేయూ పరిపాలన భవనం ఎదుట కాంట్రాక్టు అధ్యాపకులు నిరసన ఆందోళనలు చేశారు. కాంట్రాక్టు అధ్యాపకులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలకు వినతి పత్రాలను అందచేశారు. కొన్నేళ్ల నుంచి పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేసిన తర్వాతే వర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు భర్తీ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నేతలు కనుకయ్య, సాధు రాజేశ్, అంజన్‌రావు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం

కలెక్టరేట్ ఎదుట సీపీఐ (ఎంఎల్) నాయకుల నిరసన



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడ్డం సదానందం

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ మతోన్మాద, ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం సదానందం పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ కలెక్టరేట్ ఎదుట మత రాజకీయాలను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు గడ్డం సదానందం, జిల్లా కార్యదర్శి చిర్ర సూరి మాట్లాడుతూ.. దేశంలో మతోన్మాద, బ్రాహ్మణీయ మనువాద రాజ్యస్థాపనే ధ్యేయంగా విద్య, పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో సంస్కరణలు తీసుకొస్తున్నారని అన్నారు. కార్మికుల శ్రమను పెట్టుబడిదారులకు దోచిపెట్టేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. కేంద్రం కుట్రలను ప్రజలందరూ ఐక్యంగా తిప్పికొట్టాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్‌వో విజయలక్ష్మికి అందజేశారు.

కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి బొట్ల రాకేశ్, మైదం పాణి, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు, అడ్డురి రాజు, దార లింగన్న, కత్తుల కొమురయ్య, సతీష్, అంకూస్, బుచ్చన్న, జవహర్‌లాల్, మల్లేశ్, కట్టయ్య, స్వరూప, సరోజన, సంతోష, ఇంద్ర, మరియ, మమత, రాధమ్మ, లక్ష్మమ్మ, రమ తదితరులు పాల్గొన్నారు.



కాలువలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు



కాలువలో పేరుకుపోయిన చెత్త

అధ్వానంగా ఆర్‌ఎస్‌నగర్

కంపుకొడుతున్న డ్రెయినేజీ ● ఏపుగా పెరిగిన పిచ్చి చెట్లు ● అస్తవ్యస్తంగా శ్మశాన వాటిక

మిల్స్ కాలనీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్ 36వ డివిజన్ చింతల్‌లోని ఆర్‌ఎస్‌నగర్ ప్రాంతం అధ్వానంగా తయారైంది. కాలనీవాసులు తాగునీటికి తండ్లాడుతున్నారు. మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయి కంపుకొడుతోంది. శ్మశానవాటిక అస్తవ్యస్తంగా ఉంది. అగర్తల కాలువలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి క్రిమికీటకాలకు నివాసంగా మారింది.

- **తాగునీటికి తండ్లాడుతున్న జనం..**

మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఉన్నప్పటికీ నీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉండటంతో ప్రజలు తాగు నీటి కోసం తండ్లాడుతున్నారు. మనిసిపాలిటీ ట్యాంకర్ల మీదనే ఆధారపడుతున్నారు. పుప్పాలగుట్టలో కొత్తగా నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు నీరు లేక నిరుపయోగంగా ఉంటోంది.

- **భయపెడుతున్న శ్మశాన వాటిక...**

ఆర్‌ఎస్‌నగర్‌లోని శ్మశాన వాటికలో వసతులు కరువయ్యాయి. నీటి వసతి సరిగా లేదు. బోర్ పనిచేయడక పోవడంతో అంతిమ సంస్కారాల అనంతరం స్నానాలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మహిళల స్నానాల గదులు పూర్తిగా శిథిలమయ్యాయి. ప్రహరీ గోడల ఎత్తు తక్కువగా ఉండడంతో దహనసంస్కారాలు జరుగుతున్నప్పుడు జనం భయపడుతున్నారు. బర్నింగ్ ప్లాట్‌ఫామ్స్‌పై పొగ గొట్టాలు శిథిలమవడంతో పొగ మొత్తం పక్కనున్న ఇండ్లలోకి వెళుతోంది. పిచ్చి మొక్కలు పెరిగి అంతిమ సంస్కారాలకు ఇబ్బంది అవుతోంది.

- **పారిశుధ్యం అంతంత మాత్రమే...**

ఆర్‌ఎస్‌నగర్‌లో పారిశుధ్యం అంతంతమాత్రంగానే ఉంది. మురుగు కాలువల్లో చెత్తచెదారం పేరుకుపోయి ఉంది. ఖాళీ స్థలాలు చెత్తకుప్పలుగా మారుతున్నాయి. డ్రెయినేజీ పైపుల్లో చెత్త పేరుకుపోయి మురుగునీరు రోడ్లపైకి వస్తోంది. అగర్తల కాలువలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయి నాలా మొత్తం మూసుకుపోయింది. దీంతో వర్షాకాలంలో మురుగునీరంతా ఇళ్లలోకి వస్తోంది.



బర్నింగ్ ప్లాట్‌ఫామ్ పక్కన ఎత్తు తక్కువగా ఉన్న ప్రహరీ



కనీస వసతులు లేని శివనగర్ శ్మశానవాటిక



తూర్పుకోటలోని శ్మశానవాటిక



ప్రహరీ లేని ఎస్టీ వర్గానికి చెందిన శ్మశానవాటిక

అంత్యక్రియల్లోనూ అవస్థలు తప్పవా?

అండర్‌రైల్వేగేట్ ప్రాంతంలో అధ్వానంగా శ్మశానవాటికలు ● కనీస వసతులు లేక ఇబ్బందులు ● పట్టించుకోని పాలకులు

ఖిలావరంగల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో శ్మశానవాటికలు అధ్వానంగా తయారయ్యాయి. కనీస వసతులు లేక జనాలు ఇబ్బందిపడుతున్నారు. వరంగల్ అండర్‌రైల్వేగేట్‌లోని కరీమాబాద్, ఉర్సు, రంగశాయిపేట, శంభునిపేటతో పాటు పెరకవాడ, శివనగర్, చింతల్, పుప్పాలగుట్ట, ఖిలావరంగల్ ప్రాంతాలలోని శ్మశానవాటికలలో ఘాట్‌లు లేవు. మహిళలకు స్నానాల గదులు, స్టాటిక్ ట్యాంక్‌లు, చేతిపంపులు కరువయ్యాయి. దీంతో కర్మకాండలు చేసేందుకు మృతుల కుటుంబసభ్యులు, బంధువులు అవస్థలు పడుతున్నారు. వరంగల్ శివనగర్ వాటర్‌ట్యాంక్ వద్ద గల శ్మశానవా టికకు వెళ్లేందుకు జనాలు ఇబ్బంది పడుతున్నారు. అండర్ డ్రైయినేజీ పనుల కారణంగా రోడ్డు మూసుకుపోయి అందులోకి వెళ్లాలంటే చుట్టూ తిరిగిరావాల్సి వస్తోంది. అందులో సెంట్రల్‌లైట్స్ వెలగడంలేదు. సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇక గదులు లేక దినకర్మలు, పిండ ప్రదానాలు చేసేందుకు ఎండలో అవస్థలు పడుతున్నారు.

ఖిలావరంగల్ 37,38 డివిజన్లలో మొట్టుదర్వాజ, మాల అగర్తల, కుమ్మరికుంట ఎస్సీ, ఎస్టీకాలనీ, తూర్పు కోటలోని ముదిరాజ్, గౌడ, యాదవ, పెరిక తదితర కులాల వారు వేరువేరుగా శ్మశానవాటికలను ఏర్పాటు చేసుకున్నారు. కాని వాటిలో స్నానాలగదులు, కమ్యూనిటీభవనం, విద్యుత్ దీపాలు, స్టాటిక్‌ట్యాంక్, చేతిపంపులు లేవు. ట్యాంకర్ల ద్వారా నీళ్లను తెచ్చుకొని స్నానాలు చేస్తున్నారు. కనీసం అస్తికలు భద్రపర్చే గది లేకపోవడంతో శివనగర్‌లోని శ్మశానవాటికలో భద్రపర్చుకొని మంచిరోజులు ఉన్నప్పుడు కాళేశ్వరం, భద్రాచలం పుణ్యక్షేత్రాలకు వెళుతున్నారు.

తూర్పుకోటలోని ముదిరాజ్‌కులస్తుల కోసం నిర్మించిన శ్మశానవాటిక అగర్తల చెరువు సమీపంలో ఉంది. అక్కడికి వెళ్లేందుకు రోడ్డు సక్రమంగా నిర్మించలేదు. రోడ్డుకిరువైపులా ముళ్లపొదలు ఏపుగా పెరిగిపోయాయి. దీంతో అక్కడ మల, మూత్ర విసర్జన చేస్తున్నారు. ఇక పెరిక, యాదవ, గౌడ కులాలకు చెందిన శ్మశానవాటికలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కొన్ని ఇంటి పేర్లతో ఉన్న శ్మశానవాటిక లలో స్మశానఘాట్‌లను నిర్మించలేదు. తూర్పుకోటలోని యాదవ శ్మశానవాటిక రోడ్డు వెడల్పులో పోయింది. వారికి ప్రభుత్వం వేరేచోట స్థలం కేటాయిస్తామని ప్రభుత్వం చెప్పినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు.



ఎలాంటి వసతులు లేని శ్మశానవాటిక



రోడ్డు వెడల్పులో స్థలం పోవడంతో ఆగిపోయిన శ్మశానవాటిక

మౌలిక వసతులు కల్పించాలి..



సంగరబోయిన విజయ్, తూర్పుకోట

అండర్‌రైల్వేగేట్‌లోని పలు శ్మశానవాటికలలో రోడ్లు, విద్యుత్‌దీపాలు, ఘాట్‌లు, పిట్టగద్దెలు, చేతిపంపులు, స్టాటిక్ ట్యాంకులు సరిగా లేవు. కనీసం తాగునీటి సౌకర్యాలు కరువయ్యాయి. దినకర్మలు, పూజలు చేసేందుకు భవనాలు లేక మృతుల కుటుంబసభ్యులు ఇబ్బందుల పాలవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి శ్మశానవాటికలలో కనీస వసతులు కల్పించాలి.

రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్న మోదీ

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ, రాజ్యాంగ స్ఫూర్తిని మోదీ సర్కారు దెబ్బతీస్తోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణలో భాగం గా 'జైబాపు, జైభీమ్, జైసంవిధాన్' నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో మంగళవారం హనుమకొండ 7, 8, 10 డివిజన్లలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వారసత్వం, విలువలు కాపాడటానికి దేశవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలను ఐక్యం చేయడంతో పాటు సామాజిక న్యాయం సందేశంతో ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి

పట్టాలు పొందిన వేళ.. ఆనంద హేల

అట్టహాసంగా కేఎంసీ 61వ గ్రాడ్యుయేషన్ డే

- ఆనందంతో పులకరించిన తల్లిదండ్రుల మనసులు
- ముఖ్యఅతిథిగా హాజరైన కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ నందకుమార్‌రెడ్డి
- వైద్యులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచన



కూతురు పట్టా అందుకున్న ఆనందంలో తల్లి

7

ఓఆర్ఆర్ బ్రిడ్జి వద్ద బస్సు బోల్తా

- డ్రైవర్‌తో సహా పలువురు ప్రయాణికులకు గాయాలు
- హనుమకొండ జిల్లా చింతగట్టు వద్ద ఘటన



6



భానాపురంలో నేలవాలిన మొక్కజొన్న పంట

- పంటలు, ఇళ్లకు తీవ్ర నష్టం
- నేలరాలిన మామిడి కాయలు
- వాలిన మొక్కజొన్న, వరి
- విరిగిపడ్డ చెట్లు, ఎగిరిపోయిన రేకులు
- భయాందోళన చెందిన ప్రజలు
- ఆదుకోవాలని రైతుల వేడుకోలు

చెడగొట్టు గాలి

నర్సంపేట డివిజన్‌లో గాలి దుమారం



గోల్యానాయక్ తండాలో రేకులు లేచిపోయిన ఇల్లు



ఖానాపురంలో తెల్లకంకిగా మారిన వరి గొలుసులు

ఖానాపురం/చెన్నారావుపేట/దుగ్గొండి/నెక్కొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్‌లో సోమవారం రాత్రి వీచిన ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. బలంగా వీచిన గాలులకు మామిడితోటల్లో కాయలు రాలిపోయాయి. మొక్కజొన్న పంట మొత్తంగా వాలిపోయింది. పొట్టదశలో వరిపైరుకు తీవ్ర నష్టం వాటిల్లింది. పలు ఇండ్లపై రేకులు ఎగిరి పోయాయి. రహదారులపై చెట్లు నేలకొరిగాయి. తీవ్రమైన శబ్దంతో వీచిన గాలులకు ప్రజలు భయాందోళనకు గురయ్యాయి. ముఖ్యంగా నర్సం పేట డివిజన్‌లోని ఖానాపురం, నెక్కొండ, చెన్నారావుపేట, దుగ్గొండి మండలాల్లో తీవ్రంగా నష్టం వాటిల్లింది.

దెబ్బతిన్న పంటలు

ఖానాపురం మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి వీచిన గాలిదుమారంతో ప్రజలు ఇబ్బందు లుపడ్డారు. పలువురి రైతుల పంటలు దెబ్బతి న్నాయి. అశోక్‌నగర్ శివారు గోల్యానాయక్ తండాలో ధరావత్ నర్సింహకు చెందిన ఇంటి రేకులు ఎగిరిపోయి దూరంగా పడ్డాయి. కొత్తూరులో మదర్‌థెరిస్సా మహిళా సంఘానికి చెందిన నాలుగున్నర ఎకరాల మామిడి తోటలోని కాయలు నేలరాలాయి. అదే విధంగా పలు చోట్ల ఏపుగా పెరిగిన వరిపైర్లు, మొక్కజొన్న పంటలు నేలవాలడంతో రైతులు ఇబ్బందులుపడ్డారు. అలాగే గాలిదుమారం బీభత్సంతో వరి పైరుపై తీవ్ర ప్రభావం పడింది. పొట్టదశలో ఉన్న వరిపైరు పాలుపోసుకుంటున్న వరి గింజల్లో మూగ పగిలి తెల్లకంకులుగా మారండంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. సోమవారం వరకు నిక్షేపంలా ఉన్న వరిపొలాలు గాలిదుమారంతో రాత్రికి రాత్రే తెల్లకంకిగా మారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెద్దమ్మగడ్డ, మను బోతులగడ్డ, బండమీది మామిడి తండా శివారులోని పంట పొలాల్లో తెల్లకంకి తీవ్రంగా ఉందని రైతులు తెలిపారు. వాతావరణ మార్పులతో కలిగిన నష్టానికి ప్రభుత్వం స్పందించి వెంటనే పరి హారం అందించాలని రైతులు ఆబోతు అశోక్, యాకుబ్‌పాషా, వల్లెపు సోమయ్య, దేవేందర్‌తో పాటు పలువురు రైతులు కోరుతున్నారు.

మొక్కజొన్న వరికి నష్టం

దుగ్గొండి మండలంలోని పలు గ్రామాలలో సోమవారం రాత్రి వీచిన ఈదురు గాలులతో వరి, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. మండలంలో ప్రధానరహదారిపై చెట్లు విరిగి పడడంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. పెద్దఎత్తున ఈదురు గాలిరావడంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందారు. మొక్కజొన్న, వరి పంట సాగు చేసిన రైతులు నష్టపోయారు.

నేలరాలిన మామిడి కాయలు

చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేట, జల్లి, ఖాదర్‌పేట, ఉప్పరపల్లి, కోనాపురం తోపాటు పలు గ్రామాలల్లో సోమవారం రాత్రి వీసిన ఈదురుగాలులకు పలు మామిడితోటల్లో ని కాయలు నేలరాలాయి. అంతేకాకుండా పలు చోట్ల ఇండ్లపై రేకులు గాలికి దెబ్బతిన్నాయి. ఈ దురుగాలులతో నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

కూలిన షెడ్లు, కూలిన చెట్లు

నెక్కొండ మండలంలో సోమవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. గొట్లకొండ గ్రామ శివారు మామిడితోట తండాలో రైతు మాలోతు దలిసింగ్, వెంకన్నలకు చెందిన నిర్మాణంలో ఉన్న గేదెల షెడ్డు నేలకూలింది. దీంతో రూ.10లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితులు తెలిపారు. నష్టపరిహారం ఇప్పించాలంటూ తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు మంగళవారం వారు వినతిపత్రం అందించారు. నెక్కొండ - నర్సంపేట ప్రధాన రహదారిలో భారీ వృక్షాలు రోడ్డుకు అడ్డంగా పడటంతో వాహనాల రాకపోకల కు అంతరాయం ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై మహేందర్.. సిబ్బందితో కలిసి రాత్రి సమయంలో జేసీబీ సహాయంతో చెట్లను తొలగించారు. గాలి కారణంగా దీక్షకుంట, సీతారాంపురం, ముదిగొండ, అమీన్‌పేట గ్రామాల్లో చెట్లు నేలకూలాయి. రాత్రి సమయంలో అకస్మాత్తుగా వచ్చిన గాలివానతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. రెండు గంటలు పాటు విద్యుత్ సరపరాకు అంతరాయం కలిగింది.



చెన్నారావుపేటలో నెలరాలిన మామిడికాయులు

పరిశ్రమల స్థాపనతోనే ఆర్థిక ప్రగతి

వరంగల్ కలెక్టర్ సత్యశారద



పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనతోనే ఆర్థిక ప్రగతి సాధ్యమని కలెక్టర్ సత్యశారద అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. టీజీ ఐపాస్ ఆన్‌లైన్ ద్వారా వివిధ శాఖల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి గడువులోగా అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో టీజీ ఐపాస్ ద్వారా వివిధ శాఖలకు సంబంధించి ఇప్పటి వరకు 1,365 యూనిట్లకు దరఖాస్తులు రాగా, అందులో 1,076 యూనిట్లకు అనుమతులు ఇచ్చామని, 180 అసంపూర్తిగా ఉన్నందున తిరస్కరించామన్నారు. సమావేశం అనంతరం పోషణ పక్షం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లాలో పోషణ పక్షం కార్యక్రమాల్లో నిర్దేశించిన అంశాలను దృష్టిలో ఉంచుకొని అవగాహన కార్యక్రమాలను నిర్వ హించాలని అధికారులకు సూచించారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా పోషణ పక్షం ఈ నెల 8 నుంచి 22 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జీఎం ఇండస్ట్రీస్ రమేశ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి శోభన్ బాబు, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దేవునూరు గుట్టల స్థలాన్ని ఆక్రమించలేదు..

- నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా..
- నాపై ఆరోపణలు చేసినవారు క్షమాపణలు చెప్పాలి..
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ధర్మసాగర్ మండలంలోని దేవునూరు గుట్టల స్థలాన్ని ఆక్రమించి 2వేల ఎకరాలు కబ్జా చేసినట్లు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మండిపడ్డారు. తాను గుంట భూమి కబ్జా చేసినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వారి ఇంటిలో గులాంగిరి చేస్తానని, నిరూపించకపోతే వారు నా ఇంటిలో గులాంగిరి చేయాలని సవాల్ చేశారు. మంగళవారం హనుమకొండ కాంగ్రెస్ కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. దేవునూరు గుట్టల చుట్టూ ఆరు గ్రామాల పరిధిలో ఫారెస్టు భూమి, అసైన్డ్, పట్టా భూములు ఉన్నాయని తెలిపారు. గతంలో హనుమకొండ కలెక్టర్‌గా పనిచేసిన రాజీవ్ హనుమంతు ఆధ్వర్యంలో రెవెన్యూ, ఫారెస్టు శాఖలు సంయుక్తంగా సర్వే చేసినట్లు తెలిపారు. మొత్తం 3,950ఎకరాల భూమిలో చేసిన సర్వేలో 3,750 ఎకరాలు మాత్రమే భూమి అటవీశాఖ ఆధీనంలో ఉందని, మిగతా 200 ఎకరాలల్లో అసైన్డ్, పట్టా భూములు ఉన్నట్లు తేలిందన్నారు. ఈ మేరకు అప్పటి అధికారులు హద్దులు కూడా నిర్ధారించినట్లు తెలిపారు. అయితే 1967 నుంచి అటవీశాఖ ఆధీనంలో ఉన్న 43.3ఎకరాల భూములలో తమ పట్టా, అసైన్డ్ భూములు ఉన్నాయని సుమారు 23 మంది 50 ఏళ్లుగా పంటలు వేసుకుంటే అటవీశాఖ అధికారులు తొలగిస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంత ఎమ్మెల్యేగా రైతులకు చెందిన భూమిని రైతులకు అందించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పట్టా పాస్‌బుక్కులు ఉన్న రైతులకు 2017 నుంచి రైతుబంధు డబ్బులు వస్తున్నాయని అన్నారు. వారి భూమిని వారికి ఇప్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మిగతా ఫారెస్టు భూముల్లో ఇటీవల ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో జరిగిన సమీక్ష సమావేశంలో ఏకో టూరిజం డెవలప్‌మెంట్ చేసేందుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. కాగా, 14 ఏళ్ల మంత్రిగా, ఎమ్మెల్యేగా మొత్తం 30 ఏళ్ల తన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకమని ఎమ్మెల్యే కడియం పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అందరికంటే తాను పెద్ద లీడర్‌ను తానేనని తెలిపారు. అందుకే తనను టార్గెట్ చేస్తున్నారని వాపోయారు. తనపై అసత్యపు ఆరోపణలు చేసినందుకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యలు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, లేకుంటే తాను తీసుకోబోయే చట్టపరమైన చర్యలకు సిద్ధంగా ఉండాలని కడియం హెచ్చరించారు.

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులు పార్కు స్థలాన్ని కబ్జా చేసి పర్యావరణం గురించి మాట్లాడడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజల కోసం పనిచేస్తున్న తమపై అసత్యపు ఆరోపణలు మానుకోవాలని హితవుపలికారు. గత ప్రభుత్వంలో బీఆర్‌ఎస్ నాయకులు చేసిన కబ్జాలన్నీ బయటకు తీస్తామని ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ నాయకులను హెచ్చరించారు. 30 ఏళ్లుగా విలువలతో కూడిన రాజకీయాలు చేస్తున్న కడియం శ్రీహరిలాంటి వారిపై బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపణలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అజీజ్ ఖాన్, ఆర్‌టీఏ మెంబర్ పల్లకొండ సతీష్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఐపీఎల్ బెట్టింగ్ దందా

- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పందాలు కాస్తున్న వైనం
- నిఘా పెట్టి కట్టడి చేస్తున్న పోలీసులు



వరంగల్ క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ సీజన్ వేళ క్రికెట్ బెట్టింగ్ జోరుగా సాగుతోంది. బెట్టింగ్ రాయుళ్లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో యథేచ్ఛగా పందాలు కాస్తున్నారు. పోలీసులు నిఘా పెట్టినప్పటికీ వారి కళ్లుగప్పి బెట్టింగ్ దందా చేస్తున్నారు. గత నెల 22 నుంచి ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం కాగా, ఈ 15 రోజుల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో క్రికెట్ బెట్టింగ్ పాల్పడుతూ పలువురు పోలీసులకు పట్టుబడ్డారు. వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఐపీఎల్ బెట్టింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. నిఘావర్గాలతో పాటు వేగుల ద్వారా సమాచారం రాబడుతున్నారు. అయితే లాఅండ్‌ఆర్డర్ పోలీసులు మాత్రం బెట్టింగ్‌లపై ఉదాసీతనగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

ఘటనలు

- మార్చి 25న పద్మాక్షికాలనీలో రాధా ఎక్చ్సెంజ్ యాప్ ద్వారా బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి రూ.1,58,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో ముగ్గురిలో కాకినాడకు చెందిన వీరమణికుమార్‌ను అదివారం హనుమకొండ పోలీసులు అరెస్టు చేసి 1,50,000 నగదును స్వాధీనం చేసుకున్నారు.
- ఏప్రిల్ 3న గీసుగొండలో ఆఫ్‌లైన్‌లో బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని రూ.10,000 స్వాధీనం చేసుకున్నారు.
- ఏప్రిల్ 5న కాజీపేట పీఎస్ పరిధిలో కరీంనగర్ జిల్లా వీణవంక మండలానికి చెందిన నలుగురిని అరెస్టు చేసి రూ.20,000 నగదును సీజ్ చేశారు.
- ఏప్రిల్ 5న ఆత్మకూరు పీఎస్ పరిధిలోని పెద్దపూర్ గ్రామానికి చెందిన ముక్కల రాజు ధఫబెట్, గోల్డెన్ 365 (తీన్ పత్తా) వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి రూ42,000 నగదును సీజ్ చేశారు. ఈ ఘటనలో నల్గొండకు చెందిన మర్రి సుధీర్, సురేశ్ అనే వ్యక్తులు పరారీలో ఉన్నారు.



బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు : సీపీ

వరంగల్ క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌లతో పాటు ఇతరత్రా బెట్టింగ్‌లకు పాల్పడే వ్యక్తులతో పాటు ప్రోత్సహించేవారిపై కఠిన చర్యలుంటాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల కాలంలో యువత అధికంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో క్రికెట్ బెట్టింగ్ యాప్‌ల మోజులో పడి బంగారు భవిష్యత్ అంధకారం చేసుకుంటున్నారన్నారు. యువత ఆన్‌లైన్ యాప్‌లలో పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా నష్టపోయి బలవన్మరణాలకు పాల్పడుతున్నారన్నారు. బెట్టింగ్ భూతాన్ని కట్టడి చేయాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ఐపీఎల్ సీజన్ ప్రారంభమైనందున పిల్లలపై తల్లితండ్రులు నిఘా ఉంచాలన్నారు. కమిషనరేట్ పరిధిలో బెట్టింగ్‌లను కట్టడి చేసేందుకు అందుబాటులో ఉన్న సాంకేతికతను ఉపయోగించి చర్యలు చేపడుతున్నామన్నారు. ఐపీఎల్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 4 కేసుల్లో 9 మందిని అరెస్టు చేసి రూ.42 లక్షల 68వేల లావాదేవీలు జరిగినట్లుగా గుర్తించామన్నారు. బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సీపీ కోరారు.

గీసుగొండ మండలంలో జోరుగా..

గీసుగొండ(ఆంధ్రజ్యోతి): గీసుగొండ మండలంలో క్రికెట్ బెట్టింగ్ కలకలం సృష్టిస్తోంది. బెట్టింగ్ నిర్వహిస్తున్న మండలకేంద్రానికి చెందిన గిరిధర్ అనే యువకుడిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా, మరో ఇద్దరు వ్యక్తులు తప్పించుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. కాగా, ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో క్రికెట్ బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. బెట్టింగ్‌కు పాల్పడుతున్నవారికి డబ్బులు ఎక్కడ నుంచి వస్తున్నాయనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇటీవల దొరికిన వ్యక్తుల ఫోన్‌లలోని ఫోన్‌పే, గూగూల్‌పేల ద్వారా డబ్బులు ఎక్కడ నుంచి వచ్చాయి? అని ఆరా తీస్తున్నారు. అలా సేకరించిన సమాచారంతో అనుమానిత వ్యక్తులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. అందులో బడా వ్యక్తులు కూడా ఉండటం కలకలం రేపుతోంది. అయితే కొన్నేళ్ల కిందట గీసుగొండకు చెందిన ఓ ఇంజనీరింగ్ విద్యార్థి క్రికెట్ బెట్టింగ్ మోజులో పడి డబ్బులు పోగొట్టుకుని ఆత్మహత్య చేసుకోవడం అప్పట్లో కలకలం రేపింది.



కర్రెగుట్టలపైకి రాకండి

- కగార్ నుంచి రక్షణ కోసం బాంబులు అమర్చాం..
- తొలిసారి ప్రకటించిన మావోయిస్టులు
- వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరుతో లేఖ విడుదల

6

ఎండల వేళ.. పశువులు జాగ్రత్త

- అధిక ఉష్ణోగ్రతలతో మూగజీవాలకు ప్రమాదమే..
- పశుపోషణలో యజమానులు మెళకువలు పాటించాల్సిందే..

7



కాలిపోయిన పంటను పరిశీలిస్తున్న ఇస్మాయిల్

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సంగెం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మంటల్లో కాలిపోయిన పంటలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అఖిల భారత రైతు సమైక్య ఏఐకేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని తీగరాజుపల్లిలో షాపూర్ శివారులో కాలిపోయిన మొక్కజొన్న పంట క్షేత్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు దత్తు నర్సయ్య, ఆబోతు దూదయ్యలు వేసుకున్న నాలుగు ఎకరాల మొక్కజొన్న పంట కాలిపోవడంతో వారికి రూ. 4 లక్షల వరకు నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకుని, నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండలకేంద్రంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని కోరుతూ ఎంపీడీవోకు వినతి పత్రం అందించారు. మిషన్ భగీరథ పనులు చేసి నిరుపయోగంగా ఉంచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోనే రాంచందర్, శ్రీనివాస్, రాములు, అశోక్, వెంకన్న, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలలో మొక్కల పెంపకం చేపట్టాం

దుగ్గొండి ఏపీవో శ్రీనివాస్



ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని నర్సరీలు ఉన్నాయి, ఎన్ని మొక్కలు పెంచుతున్నారు?

ఏపీవో: మండలంలో 34జీపీలలో 34 నర్సరీలు ఉన్నాయి. వాటిలో 3లక్షల 40 వేలు మొక్కలు పెంచుతున్నాం.

ఆంధ్రజ్యోతి: ఎన్ని రకాల మొక్కలు పెంచుతున్నారు?

ఏపీవో: నర్సరీలలో సుమారు 20 రకాల మొక్కలు పెంచడం జరుగుతోంది. ప్రధానంగా నీడను ఇచ్చే మొక్కలు, పూల మొక్కలు, పండ్ల మొక్కలు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: మొక్కల పెంపకానికి తీసుకునే జాగ్రత్తలు ఏమిటి?

ఏపీవో: మొక్కల పెంపకానికి ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. గ్రామ కార్యదర్శి పర్యావేక్షణలో జాతీయ ఉపాధి హామీ సిబ్బంది మొక్కలను పెంచడం జరుగుతోంది. వేసవి కాలం కావడంతో అధిక ఉష్ణోగ్రతలను నుంచి మొక్కలను కాపాడుటకు గ్రీన్ నెట్లు వాడడం జరుగుతోంది.

ఆంధ్రజ్యోతి: మొక్కలు ఎప్పుడు నాటుటకు సిద్ధంగా ఉంటాయి?

ఏపీవో: నర్సరీలలో పెంచే మొక్కలు జూన్ మాసంలో వర్షాలు పడగా నాటుటకు మొక్కలు సిద్ధం చేయడం జరుగుతుంది. పండ్ల మొక్కలు గ్రామాలలోని ప్రతీ ఇంటికి ఐదు రకాల మొక్కలు సరఫరా చేయడం జరుగుతుంది.

- దుగ్గొండి(ఆంధ్రజ్యోతి)

సుభద్రాదేవికి పలువురి నివాళి

పర్వతగిరి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల మార్కెట్ మాజీ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు తల్లి సుభద్రాదేవి ఇటీవల మృతి చెందగా, మంగళవారం వారి స్వగ్రామం ఏనుగల్లులో సంస్మరణ సభను ఏర్పాటు చేశారు. ఆమె చిత్రపటానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎంపీ బోయినపెల్లి వినోద్‌కుమార్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట నియోజకవర్గంలో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఆర్‌డబ్ల్యూఎస్, మునిసిపల్, ఎంపీడీవో తదితర అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ తాగునీటి సమస్యలు ఉంటే వెంటవెంటనే పరిష్కరించాలన్నారు. నర్సంపేట పట్టణంలో అమృత్ పనులను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో నర్సంపేట, నెక్కొండ మార్కెట్ చైర్మన్‌లు పాలాయి శ్రీనివాస్, హరీష్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు దేవేందర్‌రెడ్డి, అజహర్, పబ్లిక్ హెల్త్ డీఈ రవీంద్రనాథ్, ఎంపీడీవోలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

గుడిసె వాసుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలి..

నర్సంపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వరంగల్‌రోడ్ లోని అంబేద్కర్‌నగర్ కాలనీలోని గుడిసెవాసుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతిమాధవరెడ్డికి ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రణయదీప్, ప్రజాదండోరా జాతీయ అధ్యక్షుడు అందెరి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎంఎస్‌పీ, డీబీబీపీఎస్ ఆధ్వర్యంలో గుడిసెవాసులు చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 15వ రోజుకు చేరాయి. ఎమ్మెల్యే చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీలను చేతబూనిన గుడిసెవాసుల దీక్షలను ఎంఎస్‌పీ రాష్ట్రనాయకుడు తడుగుల విజయ్‌తో కలిసి వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ, డీబీడీపీఎస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా రమేష్

చెన్నారావుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జల్లి గ్రామానికి చెందిన సంగెం రమేష్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ఈ మేరకు నియోజకవర్గం ఇన్‌చార్జి డ్యాగల శ్రీనివాస్ నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా స్థాయిలో పదవి కేటాయించడంపై హర్షం వ్యక్తం చేసి పలువురికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నర్సంపేట పట్టణ ఉపాధ్యక్షులు మద్దెల శ్యామ్‌కుమార్, మండల నాయకులు సంకటి శ్రీనివాస్, కందికొండ సదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే ఎన్నికలు నిర్వహించడం లేదు

మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్

ఖానాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఏడాదిన్నర రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లడంతో ఓటమి భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదని మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. బీజేపీ ఆవిర్భావ వేడుకల సందర్భంగా మంగళవారం మంగళవారిపేటలో ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్ధానాలు నెరవేర్చక పోవడంతో ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వాయిదాల కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో మూటమల్లే సర్దుకునే పరిస్థితులు నెలకొన్నాయని, ఇది రేవంత్‌రెడ్డి పనితీరుకు నిదర్శనమన్నారు. నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డి సీఎం రేవంత్ రెడ్డితో సఖ్యతగా లేకపోవడంతో నర్సంపేటలో అభివృద్ధి కుంటుబడిందన్నారు.

ప్రతీ వ్యక్తికి అందిస్తున్న 6కిలోల సన్నబియ్యంలో



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాంనాయక్

కేంద్ర ప్రభుత్వం ఐదు కిలోలు అందిస్తుండగా.. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒక కిలో మాత్రమే ఇస్తూ.. సొమ్ము కేంద్రానిదైతే రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని అన్నారు. వరంగల్‌కు ఎయిర్ పోర్ట్, కోచ్ ఫ్యాక్టరీ, రామప్పకు యునెస్కోగుర్తింపు కేంద్రంలో ఉన్న బీజేపీ వల్లే సాధ్యమైందని అన్నారు. ఉద్యమకారుల జీవితాలను నాశనం చేసిన కేసీఆర్ ఇంతకాలం ఫాంహౌజ్‌లో నిద్రావస్థలో ఉండి బీఆర్ఎస్ రజతోత్సవాల పేరుతో మళ్లీ ప్రజలను మోసం చేయడానికి ముందుకు వస్తున్నాడని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై ప్రజల్లో విరక్తి పెరిగిందన్నారు. నేడు తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు రాధారపు అశోక్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు జల్లి మధు, కొరిటాల శ్రీను, సామ మల్లారెడ్డి, అనబత్తుల విజయ్, కలకోట సహదేవ్, కొయ్యడి శ్యాం, గొంది కిరణ్, ఆకుల హేమంత్, రంజిత్, మురహరి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

డీఎంహెచ్‌వో సాంబశివరావు

దుగ్గొండి, ఏప్రిల్ 8: వైద్యసిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవాలు అందించాలని డీఎంహెచ్‌వో సాంబశివరావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని రికార్డులు పరిశీలించి అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయపాలన పాటించి ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలని గ్రామాలలో ఆశ కార్యకర్తలు, పల్లెదవాఖాన డాక్టర్లు, వైద్య సిబ్బంది ప్రజలను చైతన్య పరచాలని అన్నారు. వడదెబ్బ తగలాకుండా ఉదయం, సాయంత్రం సమయాలలోనే, రైతులు, ఉపాధి కూలీలు పనులు చేసుకోవాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ఆస్పత్రిలో ఉన్న సమస్యలను స్థానిక డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్లు రాకేష్, భరత్, పృథ్వీరాజ్, హెచ్‌ఈవో సాంబయ్య, హెచ్ఎస్ సలోమి, హెల్త్ అసిస్టెంట్ రహమాన్, చాణిక్య, సూపర్‌వైజర్ సంధ్యారాణి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలన చేస్తున్న డీఎంహెచ్‌వో

నాగేంద్రుడికి వసంత ఏకాదశి పూజలు

స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య



నాగేంద్రుడి పూజల్లో పాల్గొన్న సారయ్య దంపతులు

గీసుగొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఊకల్ నాగసుబ్రహ్మణ్వేశ్వర స్వామి ఆలయంలో అశ్లేష నక్షత్ర వసంత ఏకాదశి పూజలు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పుట్టలో పాలుపోసి పూజలు చేశారు. కాగా మాజీమంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య దంపతులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి దంపతులు, కాసం అధినేత ఓంనమశివాయ, ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి సతీమణి సమిత స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్షచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ మాచినపెల్లి బాబురావు, రాజేందర్, భక్తులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న పోలీసులు

21 కేజీల గంజాయి పట్టివేత

నల్లబెల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారక్కపేట జాతీయ రహదారిపై స్థానిక పోలీసులు గంజాయిని స్వాధీనం ఘటన మంగళవారం చోటుచేకుంది. దుగ్గొండి సీఐ సాయిరమణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నారక్కపేట జాతీయ రహదారిపై స్థానిక పోలీసులు వాహనతనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో నర్సంపేట నుంచి ములుగు వైపు వెళ్తున్న ఓ ప్రైవేట్ వాహనంలో ఒక మహిళ, ఒక పురుషుడు బ్యాగులతో అనుమానాస్పదంగా కనిపించారు. వెంటనే వారిని తనిఖీ చేయగా, వారి వద్ద ఉన్న బ్యాగుల్లో రూ. 10 లక్షల 86 వేల విలువ గల 21 కేజీల ఎండు గంజాయి లభ్యమైంది. వారిరువురిని విచారించగా ముంబాయికి చెందిన ప్రవీణ్‌శివభాదర్గే, వర్షశంభాజీకటేలుగా గుర్తించి వారి వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ సాయిరమణ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై గోవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

సంగెం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీఆర్ఎన్ తండా, పల్లారుగూడ, చింతలపెల్లి గ్రామాల పరిసరా ప్రాంతాల్లో మంగళవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 900 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఎస్ఐ శిరీషరెడ్డి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా దాడులు చేయగా ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రమేష్ బాబు, సురేష్, వెంకన్న, అనిల్, వంశీ, మానస, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

మొరం అక్రమ తరలింపును అడ్డుకోవాలి

నెక్కొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అప్పల్‌రావుపేట గ్రామ శివారులోని తమ పట్టాభూముల నుంచి పలువురు అక్రమంగా మొరం తరలిస్తున్నారని మంగళవారం సాయిరెడ్డిపల్లి గ్రామస్థులు తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పల్‌రావుపేటకు చెందిన కొందరు రైతులు మూడు రోజుల నుంచి ఆర్ధరాత్రి సమయంలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారని తెలిపారు. దీంతో ఈ ప్రాంతాల్లోని తమ వ్యవసాయ భూములు సాగుకు పనికి రాకుండా అవుతున్నాయంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో చెన్నమల్ల క్రిష్ణకుమారి, బండారుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాదారు పాస్ పుస్తకాలు అందించాలి

చెన్నారావుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : సాగులో ఉన్న భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి నాగయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో పాటు నెంబర్‌వన్ కాలనీ, ఖాదర్‌పేట, జోజిపేట గ్రామాలల్లో ఉన్న సర్వే నెంబర్ 356లో ఉన్న భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించాలన్నారు. గత 50 సంవత్సరాలుగా రైతుల భూమికి పట్టాదారు పాసు పుస్తకాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఈసంపెల్లి బాబు, కోరబోయిన కుమారస్వామి, నమిండ్ల స్వామి, పరికి మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కులో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

గీసుగొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాయంపేటహవేలి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో గల కైటెక్స్ కంపెనీలో నియామక ఉద్యోగాల కోసం మంగళవారం కంపెనీ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుతో పాటు రంగారెడ్డి జిల్లాలోని సీతారాంపురంలో గల కైటెక్స్ వస్త్రపరిశ్రమలలో పలు విభాగాలలో పనిచేసేందుకు గాను 25 వేల ఉద్యోగాలు ఉన్నట్లు కంపెనీ ప్రకటించి నిరుద్యోగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. కంపెనీ అధికారిక కైటెక్స్ గార్మెంట్స్ డాట్ కామ్ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను పొందపరచగా పలువురు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. కాగా 500 మందికి పైగా అభ్యర్థులు మంగళవారం ఇంటర్వ్యూలకు హాజరయ్యారు.

అయితే అభ్యర్థుల నుంచి పూర్తి బయోడేటాలను తీసుకున్న కంపెనీ అధికారులు వారికున్న అనుభవాన్ని ఆధారంగా ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. షార్ట్ లిస్ట్ చేసిన అనంతరం కాల్‌ఫర్ చేయనున్నట్లు మేనేజర్ మనోజ్‌కుమార్ తెలిపారు. కంపెనీలో ఉద్యోగాల కల్పన అనేది నిరంతరంగా కొనసాగుతుందని ఆయన చెప్పారు. దేశంలోనే అతిపెద్ద పరిశ్రమలలో ఒకటైన కైటెక్స్ పరిశ్రమలో ఉద్యోగాల కోసం స్థానిక యువతి, యువకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

వర్కర్ల వేతనాలను విడుదల చేయాలి

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వర్కర్ల వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆదర్శ పాఠశాల విద్యా కమిటీ పేరుతో విద్యా సంవత్సర ప్రారంభంలో కమిటీ తీర్మానం ప్రకారం స్కూల్ స్వీపర్లను నియమించుకోవడం జరిగిందన్నారు. 9 నెలల నుంచి వర్కర్ల వేతనాలను విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 30 మంది విద్యార్థులు ఉంటే రూ.3వేలు, 30 నుంచి 60 మంది ఉంటే రూ.6వేలు, 60కి పైగా ఉంటే రూ. 12వేలు ఇస్తామని చెప్పి నియామకం చేసుకొని నేడు ఎంత మంది విద్యార్థులు ఉన్నా రూ. 3వేలు ఇస్తామని చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా జీవో ప్రకారం పెండింగ్ వేతనాలను మంజూరు చేయాలని, లేని ఎడల ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో కొలూరి లక్ష్మీనారాయణ, గొర్రె విజయ, రమాదేవి, లక్ష్మి, మౌనిక, సుజాత, పూజిత, బేతం రేణుక, బేబి, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని వివరించాలి

వర్ధన్నపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ విలువలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించి అవగాహన కల్పించాలనే కాంగ్రెస్ పార్టీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యాక్రమ ఇంచార్జి జనగాం రమేష్‌గౌడ్, ఐనవోలు దేవస్థానం చైర్మన్ కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు తూళ్ల రవిలు అన్నారు. ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు మంగళవారం వర్ధన్నపేట మునిసిపాలిటీలోని 4, 5, 6, డివిజన్‌ల పరిధిలోని తండాలలో పట్టణ అధ్యక్షుడు మైస సురేష్ ఆధ్వర్యంలో రాజ్యాంగ బుక్, పీఠిక, జాతీయజెండాను చేతపట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డా. బీఆర్ అంబేద్కర్ నిరంతర పోరాటం ఫలితమే నాటి భారత రాజ్యాంగం అని అన్నారు. అలాంటి మహనీయుడిని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా అవమానించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోషల వెంకన్న, సమ్మెట సుధీర్, సిలువేరు శ్రీధర్‌యాదవ్, ఎండీ అన్వర్, తుమ్మల రవీందర్, భూక్య శ్రీలత, బాషా, చిటురి రాజు, కొండేటి బాలకృష్ణ, అంగోతు భిక్షపతి, నానునాయక్, మాలోతు స్వామి, బాబులాల్, రాము, దుబ్బాక రాజు, తదితరులు పాల్గొన్నారు.

● రాయపర్తి: భారత రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత అని మండల ఇన్‌చార్జి మహ్మద్ అప్సర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్‌లు అన్నారు. మండలంలోని బురహాన్‌పెల్లి నుంచి కొండూరు మీదుగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, నాయకులు వీరారెడ్డి, గిరగాని రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా బైపాస్ రోడ్డు

కట్ర్యాలలో పైపు ఎల్బోనే సూచిక బోర్డు



కూడలిలో ఏర్పాటు చేసిన పైపు ఎల్బో

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : పైపు ఎల్బోనే సూచిక బోర్డుగా మారింది. వేగంగా వస్తున్న వాహనాలను కట్టడి చేసేందుకు గ్రామస్థులు దీనిని కూడలిలో పెట్టి ప్రమాదాలు జరగకుండా తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. మండలంలోని కట్ర్యాల గ్రామంలోని ప్రజలు దీనికి శ్రీకారం చుట్టారు. కొత్తపెల్లి, ల్యాబర్తి, కొత్తూరు, పెర్కవేడు, అన్నారం గ్రామాలకు వెళ్లాల్సిన వాహనాదారులు నూనతంగా కట్ర్యాల గ్రామం నుంచి ఏర్పాటైన బైపాస్ రోడ్డు ద్వారా ఎక్కువగా ప్రయాణం చేస్తున్నారు. కట్ర్యాల నుంచి ఇల్లంద, కొత్తపెల్లి ఆకేరు వాగు బ్రిడ్జి పై నుంచి గ్రామ శివారులో నుంచి నేరుగా ల్యాబర్తికి వెళ్లేందుకు ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా మారింది. దీంతో వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై నుంచి కాకుండా ఇటు వైపు ఎక్కువగా వాహనాలు వెళ్తున్నాయి.

అయితే గ్రామంలోని నివాస గృహాల గుండా ఈ రహదారి ఉండడంతో వాహనాల వేగానికి ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా వాహనాల రద్దీ ఎక్కువైంది. దీంతో కట్ర్యాల వాటర్ ప్లాంట్‌లోని కూడలి వద్ద ఇటీవల పలు ప్రమాదాలు కూడా జరిగినప్పటికీ, ప్రాణపాయం తప్పింది. దీంతో భారీ పైపు లైన్ ఎల్బోను కూడలిలో ఏర్పాటు చేసి వాహనాల వేగానికి కళ్లెం వేస్తున్నారు. అధికారులు చొరవ చూపి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాల నివారణకు చెక్ పెట్టొచ్చని కోరుతున్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమమే సంఘం లక్ష్యం

కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్



మహాసభలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమమే తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం లక్ష్యమని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగాని ప్రవీణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మేర భవన్‌లో సంఘం 3వ మహాసభలు ఎం.డి. యాకూబ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో అసంఘటిత కార్మిక రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల కష్టంతో ఏర్పాటు చేసుకున్న నిధుల ద్వారా నడపబడుతున్నటువంటి కార్మిక శాఖకు కార్మికులే పెద్ద నిధి అని అన్నారు. భవన నిర్మాణాల ద్వారా వస్తున్న 1 శాతంసెస్‌తో జమ అవుతున్న వేల కోట్ల రూపాయల నిధి కార్మికుల కుటుంబాలకు ఆసరాగా నిలుస్తోందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం కార్మిక శాఖ, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్మిక శాఖ నిధులను పక్కదారి పట్టిస్తున్న అధికారులు, దళారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా ఎం.డి. యాకూబ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోవర్ధన్ మియాపురంలను ఎన్నుకున్నారు. ఈ సభలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ గన్నారపు రమేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, పలాస ప్రసాద్, షేక్ బాష్మియా, గుంపెల్లి మునీశ్వర్, అక్కపెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు మేతగా పంట

పర్వతగిరి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీరు లేక ఎండిపోతుంటే రైతులు వాటిని చూసి కన్నీటి పర్యంతమతున్నారు. చేసేదేమీ లేక ఎండిపోయిన పంటను పశువులకు మేతగా వేస్తున్నారు. మండలంలోని పెద్ద తండాకు చెందిన రైతులు పక్కనే ఉన్న పెద్దకాల్వ ద్వారా నీరు వస్తుందని నమ్మి తమ పొలాల్లో వరి సాగు చేశారు. అయితే ఈ సారి కాల్వద్వారా నీరు రాకపోవడంతో పంట సరిగా పండలేదని, గ్రామానికి చెందిన నూనావత్ రవి వాపోయాడు. దీంతో పంట కనీ సం పశువులకు ఆహారంగానైనా పనికొస్తుందని వరి చేలును మేపుతున్నామని తెలిపాడు.



నీళ్లులేక వరి పంట ఎండిపోవడంతో పశువులను మేపుతున్న దృశ్యం